

2క్కోచోట 2క్కో అలైన్‌మెంటా?

- పలమనేరులో అస్తవ్యస్తంగా జాతీయరహదారి విస్తరణ పనులు
- అవసరమున్న చోట పాత రహదారినే వదిలేశారు

పలమనేరు, ఆంధ్రజ్యోతి

పలమనేరు- హైదరాబాద్ జాతీయరహదారి విస్తరణ పనులు పలమనేరులో అస్తవ్యస్తంగా వున్నాయి.నాలుగేళ్ల క్రితం గతంలో ఉన్న రహదారిని నాలుగు లేన్లుగా విస్తరించేందుకు పనులు చేపట్టారు. అయితే పనులను పర్యవేక్షించిన అధికారులు అప్పటి వైసీపీ నాయకులతో, విస్తరణతో విలువైన స్థలాలు కోల్పోయే వర్గాలతో లాలూచీ పడి ఒక్కోచోట ఒక్కోవెడల్పుతో పనులు చేశారు. పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్ నుంచి దండపల్లి రోడ్డు కలిసే మలుపు వరకు ఉన్న సుమారు కిలోమీటరు రహదారిలో ఒక్కోచోట ఒక్కో విధంగా రోడ్డు విస్తరణ జరిగింది.ఒక చోట దాదాపు 150 అడుగుల వెడల్పు వచ్చేవిధంగా రహదారిని విస్తరించారు. కొన్ని చోట్ల పాతర హదారిని అలాగే ఇరుగ్గా వదిలి పెట్టేశారు. అంబేడ్కర్ సర్కిల్ వద్ద హైదరాబాద్ నుంచి మదనపల్లె మీదుగా వచ్చే వాహనాలు పట్టణంలోని బెంగళూరు- చెన్నై జాతీయ రహదారిపై కలుస్తాయి. రెండు జాతీయ రహదారులు కలిసే ఈ ప్రాంతంలోనే వాస్తవానికి రోడ్డు బాగా విస్తరించాల్సి వుంది. అయితే పాతరోడ్డును అలాగే విడిచిపెట్టేశారు. దీంతో ఈ సర్కిల్ వద్ద వాహనాలు అధిక సంఖ్యలో వచ్చినప్పుడల్లా ట్రాఫిక్ స్తంభించిపోతూ వుంటుంది. ఇక ఇదే రహదారిలో పట్టణంలోని రంగమహల్ మీదుగా వచ్చే రహదారి కలిసే రెక్కమాను వద్ద కూడా రోడ్డు విస్తరణ చేయకుండా పాతరోడ్డును అలాగే వదిలి పెట్టేశారు. ఇక గుండుబావి సమీపంలో గంగవరం మండలం దండపల్లి నుంచి వచ్చే రహదారి వద్ద మలుపు కూడా వుంది. ఈ మలుపు ఎన్నో ఏళ్లుగా ప్రమాదాలకు నిలయంగా వుంది. ఇక్కడ కూడా రోడ్డు విస్తరణ పనులు చేయకుండా అలాగే విడిచిపెట్టేశారు.రెండేళ్లక్రితం ఒక విద్యార్థి రాత్రిపూట మోటరు సైకిల్‌పై వస్తూ ఈ మలుపులో అదుపు తప్పి ఎదురుగా వస్తున్న మోటరు సైకిస్టును ఢీకొనడంతో ఆయన దుర్మరణం పాలయ్యాడు.ఇక ఆటోలు కూడా ఈ ఇరుకైన మలుపు వద్ద తరచూ ప్రమాదాలకు గురవుతున్నాయి. అతివేగంగా వచ్చే వాహనాలు ఈ మలుపు వద్ద ఒక్కసారిగా వేగాన్ని నియంత్రించలేక ఎదురుగా వచ్చే వాహనాలపై దూసుకుపోతుంటాయి. దీంతో ఎదురుగా వచ్చే వాహనదారులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ఈ మలుపు దాటాల్సిన పరిస్థితి. అంతేకాక ఈ మలుపు వద్ద మురుగునీటికాలువ వెళ్తోంది. రోడ్డుకు అన్ని చోట్లా పాదచారులు వెళ్లేందుకు వీలుగా ఫుట్‌పాత్ వుంటుంది. ఇది జాతీయ రహదారిలో అయితే తప్పని సరి. అయితే ఇక్కడ ఉన్న మలుపులో ఫుట్‌పాత్ లేదు సరికదా మురుగునీటి కాలువే రోడ్డుకు ఆనుకొని వుంది. దీంతో ఈ మలుపు వద్ద వాహనదారులు, ద్విచక్రవాహన దారులు ఏమాత్రం అదుపు తప్పినా ప్రమాద తీవ్రత ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ఈ రహదారి ఉదయం, సాయంత్రం వేళల్లో రద్దీగా వుంటుంది. ఈ జాతీయరహదారికి ఆనుకొనే పట్టణ పొలిమేరల్లో సుమారు 5 కిలో మీటర్ల మేర ప్రైవేటు, ప్రభుత్వ విద్యాసంస్థలు ఉన్నాయి. ఈ విద్యాసంస్థల్లో చదువుకుంటున్న వే లాది వ ంది విద్యార్థులు ఈ రహదారిపై విద్యాసంస్థల బస్సుల్లో, ద్విచక్రవాహనాల్లో, ఆటోల్లో వెళ్తుంటారు. అంతే కాక పలమనేరు నుంచి గంగవరం, పెద్దపంజాణి మండలాల్లోని వివిధ గ్రామాలకు వందల సంఖ్యలో ఆటోలు ప్రయాణికులను ఈ జాతీయరహదారిగుండానే తరలిస్తుంటారు.లగేజి ఆటోల్లో టమోటా, బీన్సు, క్యాబేజి, ముల్లంగి, చిక్కుడు, సొర, బీర వంటి కూరగాయలను పలమనేరులోని మార్కెట్‌కు ఈజాతీయరహదారిగుండానే రైతులు తీసుకొస్తుంటారు. ఇంత రద్దీగా వుండే ఈ జాతీయరహదారిని ఒక్కోచోట ఒక్కోవిధంగా అలైన్‌మెంట్‌తో విస్తరించి ప్రమాదకరమైన మలుపుల్లో, ప్రదేశాల్లో పాత ఇరుకు రోడ్డును అలాగే విడిచిపెట్టడంలో ఆంతర్యం ఏమిటో జాతీయరహదారి అధికారులకే తెలియాలి.రోడ్డు విస్తరణలో పాత రోడ్డును అలాగే విడిచి పెట్టడంతో ఈ మలుపు వద్ద పెద్ద పెద్ద భవంతులు, షాపింగ్ గదుల నిర్మాణాలు జరిగిపోయాయి. ఇప్పుడు వాటిని తీసివేయడం కూడా ఇబ్బందే.ఇకనైనా అధికారులు జాతీయరహదారిలో నిబంధనల మేరకు అన్ని చోట్లా రోడ్డు అలైన్ మెంట్ ఒకే విధంగా వుండేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు. అనుకోని ప్రమాదాలు జరిగితే అందుకు రోడ్డు విస్తరణ పనులు సక్రమంగా చేయని జాతీయరహదారి అధికారులే బాధ్యత వహించాల్సి వస్తుందంటున్నారు.



పలమనేరులో దండపల్లి రహదారి కలిసే మలుపులో ఇరుగ్గా వున్న రహదారి



పలమనేరులోని అంబేడ్కర్ సర్కిల్ వద్ద బెంగళూరు రహదారిపై కలిసే హైదరాబాద్ రహదారి ఇరుగ్గా ఉన్న ప్రదేశం



పలమనేరు అంబేడ్కర్ సర్కిల్‌కు, దండపల్లి రోడ్డు కలిసే జాతీయరహదారిలో 150 అడుగుల వెడల్పు కంటే ఎక్కువగా కన్పిస్తున్న రహదారి

కంపెనీపేరు	: బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్, ఐవోసీఎల్
ఉచిత గ్యాస్ లబ్ధిదారులు	: 3,49,953
రాయితీ సొమ్ము పొందినవారు	: 3,48,972
రిలీజైన సబ్సిడీ మొత్తం	: రూ. 28,33,24,510
జమయిన సొమ్ము	: రూ. 28,25,31,881
రాయితీ అందనివారు	: 981
టోల్‌ఫ్రీ నెంబరు	: 1967
చమురు కంపెనీల నెంబరు	: 1800 23 33 555

రంజాన్ వేళలు

ఇఫ్తార్: 6:29 (శుక్రవారం సాయంత్రం)
సహర్: 4:56 (శనివారం ఉదయం)

కలెక్టరేట్‌లో ఉద్యోగినులకు 'షీ బాక్స్'



ఫిర్యాదుపెట్టెను ప్రారంభించిన కలెక్టర్, జేసీ తదితరులు

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఏపీజేఏసీ అమరావతి - చిత్తూరు మహిళా విభాగం ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో 'షీ బాక్స్' (ఫిర్యాదుపెట్టె)ను ఏర్పాటు చేశారు. దీన్ని గురువారం కలెక్టర్ సుమిత్‌కుమార్, జేసీ విద్యాధరి ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. మహిళా ఉద్యోగులు ఏ శాఖలో ఉన్నా, వారికి ఏర్పడే సమస్యలపై ఫిర్యాదులను ఈ ఫిర్యాదు పెట్టెలో నిర్భయంగా వేయవచ్చన్నారు. నిర్ణీత రోజుల్లో అందిన ఫిర్యాదులను పరిష్కరించడానికి కృషిచేస్తామన్నారు. ఫిర్యాదుపెట్టె ఏర్పాటుకు అనుమతించిన కలెక్టర్‌కు ఏపీజేఏసీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు జయంతి కృతజ్ఞతలు తెలిపారు. డీఆర్వో మోహన్‌కుమార్, డిప్యూటీ కలెక్టర్ విజయలక్ష్మి, కలెక్టరేట్ ఏవో కులశేఖర్, మహిళావిభాగ ప్రధాన కార్యదర్శి లత, కోచైర్‌పర్సన్ శోభ, మెంబర్ సెక్రటరీలు సరిత, పుష్పలత, మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

సినిమా టికెట్టు కన్నా పాప్‌కార్న్ రేట్లు ఎక్కువా?

- థియేటర్ల తనిఖీలో అర్బన్ తహసీల్దార్ ఆశ్చర్యం

చిత్తూరు రూరల్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు నగరంలో గురువారం రెవెన్యూ అధికారులు నిర్వహించిన థియేటర్ల తనిఖీలో విస్తుపోయే విషయాలు బయటపడ్డాయి. ఇటీవల థియేటర్లలో టికెట్టు రేటు కన్నా.. మిగిలిన రేట్లు అధికంగా వసూలు చేస్తున్నారని ప్రేక్షకుల నుంచి కలెక్టర్‌కు ఫిర్యాదులు అందాయి. కలెక్టర్ ఆదేశాలతో చిత్తూరు అర్బన్ తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి గురువారం నగరంలోని విజయలక్ష్మి, ఎంఎస్‌ఆర్, గురునాథ, రాఘవ, వెంకటేశ్వర, చాణక్య థియేటర్లలో తనిఖీ చేశారు. ప్రీమియం టికెట్ రేటు కన్నా పాప్‌కార్న్ రేటు అధికంగా ఉందని ఆశ్చర్యపోయారు. సినిమా హాల్‌లో పార్కింగ్ ఫీజు వసూలు చేయకూడదంటే.. టూవీలర్‌కు రూ.20, కార్లకు రూ.50 వసూలు చేస్తున్నట్లు గుర్తించారు. రూ.20 వాటర్ బాటిల్‌ను రూ.30 విక్రయిస్తున్నట్లు గమనించారు. తినుబండారాలైతే సామాన్య ప్రేక్షకులు కొనలేని విధంగా ఉన్నాయని, ఉచిత తాగునీరు కూడా కల్పించడం లేదని తేలింది. మరోసారి తనిఖీలకు వస్తామని ఇలాగే ఉంటే థియేటర్లను సీజ్ చేస్తామని తహసీల్దార్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ దినేష్ పాల్గొన్నారు.

నేడు పీవీకేఎన్‌లో యూత్ పార్లమెంట్


చిత్తూరు సెంట్రల్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): చిత్తూరులోని పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం వికసిత్‌భారత్ యూత్ పార్లమెంట్ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ జీవనజ్యోతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. భారత ప్రభుత్వం యువజన, క్రీడా మంత్రిత్వ శాఖ సంబంధించి మేరా యువభారత్ సంఘటన్ ఆధ్వర్యంలో ఉదయం 9.30 గంటలకు కార్యక్రమం నిర్వహించనున్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాకు చెందిన 18-25 ఏళ్ల మధ్య యువకులకు వక్తృత్వ పోటీలు నిర్వహించి జిల్లా స్థాయికి 110 మందిని ఎంపిక చేస్తారు. వీరి నుంచి 10 మందిని రాష్ట్ర స్థాయికి ఎంపిక చేయనున్నారు.

అసెంబ్లీ 'కమిటీ ఆన్ పిటిషన్స్' సభ్యుడిగా చిత్తూరు ఎమ్మెల్యే

చిత్తూరు సిటీ, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): శాసనసభ 'కమిటీ ఆన్ పిటిషన్స్'లో సభ్యుడిగా చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ ఎంపికయ్యారు. గురువారం రాష్ట్ర అసెంబ్లీలో వివిధ కమిటీలను ఏర్పాటు చేస్తూ స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో శాసనసభ డిప్యూటీ స్పీకర్ కె.రఘురామకృష్ణ రాజు చైర్మన్‌గా 'కమిటీ ఆన్ పిటిషన్స్' ఏర్పాటు చేశారు. ఇందులో జగన్మోహన్‌తోపాటు మరో ఐదుగురు సభ్యులు ఉంటారు. ముఖ్యమంత్రి, స్పీకర్, ఎమ్మెల్యేలకు అందిన ఫిర్యాదులపై జిల్లాల వారీగా ఈ కమిటీ సమీక్షలు నిర్వహిస్తుంది.



పునరాలోచన చేయండి సార్...!!



- ఊహించని బదిలీలపై పోలీసుల ఆవేదన

చిత్తూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల్లో వైసీపీ కోసం పనిచేసినట్లు ఆరోపణలున్న వారిని, విధుల్లో నిర్లక్ష్యంతో పాటు పక్షపాతం చూపిస్తున్న వారిని మార్చమంటూ పోలీసు శాఖను ఎమ్మెల్యేలు కోరినా పట్టించుకోలేదు.పుంగనూరు మండలంలో టీడీపీ కార్యకర్త రామకృష్ణ దారుణ హత్యకు గురయ్యాక మాత్రమే పోలీసు శాఖలో చలనం వచ్చింది.దీనికి తోడు అమరనాథ రెడ్డి లాంటి సీనియర్ ఎమ్మెల్యే వేలెత్తి చూపించడంతో ఏకాఏకిన ఏఎస్ఐ నుంచి కానిస్టేబుల్ దాకా 264మందిని ఒకేసారి బదిలీ చేశారు.అయితే ఆ బదిలీలు నిబంధనలకు అనుగుణంగా జరక్కపోవడంపై పోలీసుశాఖలోనే తీవ్ర చర్చ జరుగుతోంది.బదిలీలపై అభ్యంతరాలున్న వారు కూడా ఉన్నతాధికారుల్ని నేరుగా కలిసి తమ సమస్యలు చెప్పుకోలేని డిపార్ట్‌మెంటు కావడంతో తమ గోడును ఎవరికి చెప్పుకోవాలో తెలియక మానసికంగా కుంగిపోతున్నారు.బదిలీల విషయంగా ఉన్నతాధికారులు పునరాలోచన చేయాలని కోరుతున్నారు.

ఉదాహరణకు పెనుమూరులో పనిచేస్తోన్న ఓ ఏఎస్ఐకి ఏడాది సర్వీసు మిగిలి ఉంది. కిడ్నీ వ్యాధితో బాధ పడుతూ సీఎంసీలో చికిత్స పొందుతున్నారు. తాజా బదిలీల్లో ఆయన్ను పుంగనూరు సర్కిల్‌కు బదిలీ చేయడంతో ఏం చేయాలో పాలుపోవడం లేదు. చిత్తూరు ట్రాఫిక్‌లో ఓ హెడ్ కానిస్టేబుల్ తల్లి ఇటీవల చనిపోయారు. ఆమెను చూసేందుకు వస్తూ అల్లుడూ మరణించారు. ప్రస్తుతం కూతురు, మనవళ్ల సంక్షేమం చూసుకుంటూ ఆయన ఇంట్లో ఉన్నారు. మూడేళ్ల సర్వీసున్న ఆయనకు తాజాగా పుంగనూరుకు బదిలీ అయితే వెళ్లలేని పరిస్థితుల్లో కన్నీళ్లు పెట్టుకుంటున్నారు. అలాగే గతేడాది సెప్టెంబరులో ఎస్‌ఆర్‌పురం నుంచి కల్లూరుకు బదిలీపై వెళ్లిన ఓ మహిళా ఏఎస్ఐ ఆరు నెలలకే తాజా బదిలీల్లో బంగారుపాళ్యం బదిలీ అయ్యారు.ఇలా ఒకొక్కరిది ఒక్కో తరహా ఆవేదన. ఆరోపణలున్నవారిని కాదని అందరినీ ఒకేగాటన కట్టి బదిలీ చేశారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రెండు రోజుల్లో రిలీవ్ కావాలి

సీఎం చంద్రబాబు శుక్ర, శనివారాల్లో తిరుమలలో వుంటున్న నేపథ్యంలో జిల్లా పోలీసులు అక్కడికి బందోబస్తుకు వెళ్లారు. ఆ డ్యూటీ అయిపోయిన వెంటనే బదిలీ అయిన 264 మంది పోలీసులు రిలీవ్ కావాలని ఉన్నతాధికారులు ఇప్పటికే ఆదేశించి ఉన్నారు.అయితే అసంబద్ధంగా బదిలీలు జరిగాయంటూ సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి.అలాగే జిల్లా పోలీసు అసోసియేషన్ నేతలు ఇప్పటికే రాష్ట్ర సంఘం దృష్టికి తీసుకెళ్లగా.. రాష్ట్రస్థాయిలోనూ ప్రయత్నాలు జరుగుతున్నట్లు చెబుతున్నారు.

- ఆరు నెలలకే బదిలీ

గతేడాది సెప్టెంబరు 20వ తేదీన ముందస్తు సమాచారంతో పాటు కౌన్సెలింగ్ నిర్వహించి 201 మంది పోలీసుల్ని బదిలీ చేశారు. నిబంధనల మేరకు జరిగిన ఈ బదిలీల్లో సొంత మండలం, పనిచేసే మండలం కాకుండా మూడు మండలాలను ఆప్షనుగా ఇచ్చి బదిలీ చేశారు. తాజా బదిలీల్లో సెప్టెంబరులో స్థానచలనం పొందినవారూ ఉన్నారు.

ప్రింటింగ్ ప్రెస్ పీఐసీ పదవీకాలం పొడిగింపు

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా కో-ఆపరేటివ్ ప్రింటింగ్ ప్రెస్ అఫిషియల్ పర్సన్ ఇన్‌చార్జి (పీఐసీ), చిత్తూరు డివిజన్ కో-ఆపరేటివ్ ఆఫీసర్ యు.వనజ పదవీకాలాన్ని మరో ఆరునెలలు పొడిగిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీచేసింది. ఆమె పదవీకాలం ఈనెల 22తో ముగియనుంది. ప్రభుత్వ ఆదేశాలతో సెప్టెంబరు 22వ తేదీవరకు ఈ పదవిలో కొనసాగుతారు.

సీఎంసీ ఆస్పత్రికి ప్రభుత్వ గుర్తింపు

- ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు మెడికల్ బిల్లుల రీయింబర్స్‌మెంటు పొందవచ్చు

చిత్తూరు కల్చరల్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు.. వేలూరు సీఎంసీ ఆస్పత్రిలో వైద్యసేవలు పొంది మెడికల్ బిల్లులు రీయింబర్స్‌మెంటుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఈ మేరకు జిల్లా పెన్షనర్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎన్.కేశవులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.





తిరుమల పర్యటన నిమిత్తం గురువారం రాత్రి తిరుపతి చేరుకున్న సీఎం చంద్రబాబుకు విమానాశ్రయంలో స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యేలు పులివర్తి నాని, గాలి భానుప్రకాష్, గురజాల జగన్మోహన్

చిత్తూరు మార్కెట్‌కు రూ.64.04 లక్షల వేలం ఖరారు

చిత్తూరు అర్బన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు నగరంలోని ప్రధాన కూరగాయల మార్కెట్ గుత్తవసూలుకు సంబంధించిన బహిరంగ వేలంపాటను గురువారం కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కూరగాయల మార్కెట్‌కు నిర్వహించిన వేలం పాటలో రూ.64.04 లక్షల హెచ్చుపాటదారుడు మౌనీ కుమార్‌కు వేలంను ఖరారు చేశారు. ప్రైవేటు బస్సుల సముదాయానికి రూ.6.60 లక్షలతో రాజశేఖర్, జంతు వధశాలను రూ.1.92 లక్షలతో శేషాద్రి హెచ్చుపాట ద్వారా దక్కించుకున్నారు. కమిషనర్ నరసింహప్రసాద్, సహాయ కమిషనర్ ప్రసాద్, ఆర్వో వర్మ, తదితరులు పాల్గొన్నారు.

కూర్చునే స్థలం కోసం.. కొట్టుకున్నారు


గాయపడిన హంపయ్య, గోవిందరాజు

తిరుమల సీఆర్వో వద్ద గదుల కోసం వేచివున్న భక్తులు కొట్టుకున్నారు. కూర్చునే స్థలం విషయంలో కర్నాటక, తమిళనాడుకు లకు చెందిన రెండు కుటుంబాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. తమిళనాడులోని కోయంబత్తురుకు చెందిన కార్తీకేయ గాజు బాటిల్‌తో దాడి చేయడంతో కర్ణాటక లోని బళ్లారికి చెందిన గోవిందరాజు, హంపయ్య గాయపడ్డారు. వీరిని స్థానిక అశ్విని ఆస్పత్రికి తరలించి వైద్యం చేశారు. ఆ తర్వాత ఆ రెండు కుటుంబాలు రాజీపడినట్టు తెలిసింది.

- తిరుమల, ఆంధ్రజ్యోతి


తిరుమలలో మనో

సినీగాయకుడు మనో గురువారం ఉదయం కుటుంబ సభ్యులతో కలిసి తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అలయం ముందు అయన మీడియాతో మాట్లాడుతూ, 'ఎన్నిసార్లు చూసిన స్వామివారి రూపాన్ని మర్చిపోతుంటాం. భక్తులను మళ్లీ మళ్లీ రప్పించుకునే గొప్ప క్షేత్రం తిరుమల' అని అన్నారు. త్వరలో ఉగాది రానుందంటూ, ఈ నూతన తెలుగు సంవత్సరాదిలో కళాకారులందరి కష్టాలు తొలగిపోయి అద్భుత విజయాలు సాధించాలని శ్రీవారిని కోరుకున్నట్టు తెలిపారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి




ఏటీసీ దాకా క్యూలైన్



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 16 గంటల సమయం పడుతోంది. గురువారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని కంపార్టుమెంట్లు, నారాయణగిరి షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయి క్యూలైన్ ఏటీసీ వరకు వ్యాపించింది. ఇక, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

మంగళవారం హుండీ ఆదాయం: రూ.3.97 కోట్లు
బుధవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 72,388
తలనీలాలు సమర్పించినవారు: 26,145

నేడు అంతర్జాతీయ అటవీ దినోత్సవం





అరణ్య రోదన

- అంతరించిపోతున్న అడవులు
- పర్యావరణానికి పెను ప్రమాదం
- జనావాసంలోకి వన్యప్రాణులు

పర్యావరణ సమతుల్యానికి దోహదపడే అడవులు రాన్రానూ చిక్కిపోతున్నాయి. దురాక్రమణదారుల బారిన పడి తరిగిపోతున్నాయి. జీవవైవిధ్యానికి బాటలు వేసే వనాలు అంతరించిపోతున్నాయి. జనం చొచ్చుకు వస్తుంటే ఉండటానికి చోటు లేక జంతువులు జనారణ్యం బాటపడుతున్నాయి. కాలక్రమేణా అటవీ విస్తీర్ణం కుచించుకుపోవడంతో పర్యావరణానికి దుష్ఫలితాలు ఎదురవుతున్నాయి. ఇది భవిష్యత్‌లో మరింత ప్రాణ సంకటంగా మారుతుందని పర్యావరణ హితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

- మంగళం,ఆంధ్రజ్యోతి





అటవీ విస్తీర్ణం ఏటేటా తగ్గిపోతోంది. అటవీశాఖ తాజా విడుదల చేసిన నివేదిక ప్రకారం జిల్లాలో 8,692.82 చదరపు కిలోమీటర్ల అటవీప్రాంతం ఉంది. ఇందులో దట్టమైనది 6.38 చదరపు కిలోమీటర్లు మాత్రమే. మధ్యస్థ దట్టమైన అడవి 888.26 చదరపు కిలోమీటర్లు. బహిరంగ అడవి 1,209.39 చదరపు కిలోమీటర్లు ఉంది. మిగిలిన అటవీప్రాంతం వివిధ సార్థ ప్రయోజనాలతో తరిగిపోతోంది.

వన్యప్రాణులు జనావాసాల బాట

జిల్లా పరిధిలో శేషాచల కొండలు, వెలిగొండ అడవులు జీవవైవిధ్యానికి నిలయాలు. ఈ అడవుల్లో చిరుతలు, ఏనుగులు, ఎలుగుబండ్లు, దుప్పులు, అడవి కుక్కలు, అడవి పందులు, జాకల్స్, హనీ బ్యాడ్జర్, చుక్కల దుప్పులు, జింకలు, అరుదైన బంగారుబల్లి, పునుగుపిల్లి, దేవాంగపల్లి వంటి వన్యప్రాణులు ఆవాసముంటున్నాయి. అరుదైన ఎర్రచందనం, పెర్రిత, సాంబ్రాణి వంటి చెట్లతో పాటు మోగీ, కరక, నారేపి వృక్షాలు ఎక్కువగా కనిపిస్తుంటాయి. పక్షులు సీతాకోక చిలుకలు, పాములు, ఇతర కీటకాలు అడవినీడన నిశ్చింతగా బతుకుతున్నాయి. అడవులు కాస్తా క్రమేపి తరిగిపోవడంతో వన్యప్రాణులు గత్యంతరం లేక ఆహారం, నీటి కోసం జనావాసాల్లోకి రాకతప్పడంలేదు. .



ప్రకృతి సమతుల్యానికి భంగం

అడవుల విస్తీర్ణం తగ్గిపోవడం పెనుప్రమాదంగా తయారవుతోంది. సమతుల్యత దెబ్బతిని పర్యావరణానికే ముప్పుగా పరిణమిస్తోంది. వృక్షాల సంఖ్య తగ్గి అడవి చిన్నబోతుండటంతో ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయి. ఇప్పటికే జనం అధిక ఉష్ణోగ్రతలతో అల్లాడిపోతున్నారంటే అడవుల ప్రభావమే.ప్రకృతి సమతుల్యానికి విఘాతమేర్పడి వర్షాలూ తగ్గిపోతున్నాయని పర్యావరణ నిపుణులు ఆవేద న చెందుతున్నారు. అడవుల సంరక్షణ తక్షణ పరిష్కా రమని వీరంతా తలపోస్తున్నారు.

అభివృద్ధి పేరిట వేటు

తమ అవసరాల కోసం జనం అడవులను ఆక్రమించడం పరిపాటిగా మారింది. రోడ్లు, భవన నిర్మాణాలు, డ్యాములు, గనుల తవ్వకాల కోసమే కాదు అవసరమైన కలప కోసం అడవులపై గొడ్డలి వేటు పడుతోంది. ఈ పరిణామమే ఇపుడు మానవ మనుగడకు సవాలుగా మారింది. శేషాచల కొండల్లో శ్రీగంధం, ఎర్రచందనం వృక్షాలను అడ్డు ఆపులేకుండా నరికేస్తున్న తీరు ఆందోళన కలిగిస్తోంది. తిరుమల కొండల్లోని శ్రీగంధం వృక్షాలు కనుమరుగయ్యాయి. ఆ జాబితాలోకి ఎర్రచందనంతో పాటు అరుదైన జంతువులు చేరిపోనున్నాయి. ఇప్పటికైనా అడవులు అంతరించి పోకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

హతుడు ఎవరు?

- తిరుచానూరు పరిధిలో మృతదేహం
- ఆనవాళ్లు గుర్తుపట్టకుండా యాసిడ్ పోసి కాల్చిన దుండగులు
- స్టేషన్ల వారీగా మిస్సింగ్ కేసులపై పోలీసుల ఆరా


మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

తిరుపతి(నేరవిభాగం), మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఆనవాళ్లు గుర్తుపట్టకుండా యాసిడ్ పోసి కాల్చారు. ఇలా గుర్తు పట్టని స్థితిలో 30-35 ఏళ్ల వ్యక్తి మృతదేహం తిరుచానూరు పరిధిలోని 150 అడుగుల బైపాస్ రోడ్డు సమీపంలో పడుంది. ఇతడు ఏ ప్రాంతం వాడో తెలియని పరిస్థితి. ఎక్కడో హతమార్చి.. ఇక్కడ పడేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. తిరుచానూరు సీఐ సునీల్‌కుమార్ తెలిపిన ప్రకారం.. పూతలపట్టు-నాయుడుపేట బైపాస్ రోడ్డు సమీపంలో మృతదేహం ఉన్నట్లు గురువారం తెల్లవారుజామున స్థానికులు గుర్తించి సీఐకి సమాచారం ఇచ్చారు. మరోవైపు ఎస్పీ హర్షవర్ధనరాజు, పోలీసు అధికారులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. చామన ఛాయ కలిగిన ఆ వ్యక్తి ఎత్తు సుమారు ఐదు అడుగులు ఉండొచ్చు. ఎలిఫెంట్ కలర్ ప్యాంటు, మిల్క్ కలర్ వైట్ పైన పూలగుర్తులున్న చొక్కా ఉంది. బుధవారం అర్ధరాత్రిపైన ఇక్కడ మృతదేహాన్ని పడేసి ఉంటారని అంచనా. హతుడు ఎవరనే కోణంలో విచారిస్తున్నారు. దీనికిగాను మృతుడి ఫొటోలను అన్ని సామాజిక మాధ్యమాల్లో ఉంచారు. అన్ని పోలీసు స్టేషన్లకు పంపారు. ఈ మిస్టరీ హత్యను ఛేదించి నిందితులను కఠినంగా శిక్షించాలని ఎస్పీ అధికారులను ఆదేశించారు. దీంతో పోలీసులు భిన్న కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. జరిగిన ఘటనపై స్థానికంగా అందుబాటులో వున్న సీసీ కెమెరాల ద్వారా పరిశీలిస్తున్నారు. చంద్రగిరి డీఎస్పీ ప్రసాద్ ఆధ్వర్యంలో ప్రత్యేక నిపుణులైన పోలీసు బృందాలను నియమించారు. ఘటనా స్థలంలో డాగ్ స్క్వాడ్‌లు తనిఖీ చేశాయి. హత్యపై సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించి కీలకమైన సీసీ టీవీ ఫుటేజీ లభ్యమైనట్లు సమాచారం.

కూలీలను ఢీకొన్న కారు

- వృద్ధురాలి మృతి.. నలుగురికి గాయాలు


లారీని ఢీకొన్న కారు - ప్రమాదంలో మృతి చెందిన పద్దాల రత్నమ్మ

వెంకటగిరిటౌన్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వర్ధనపల్లి గ్రామంలో వ్యవసాయ కూలీలను కారు ఢీకొన్న సంఘటన గురువారం చోటుకుంది. ఈ ప్రమాదంలో ఒకరు మృతిచెందగా, నలుగురికి గాయాలయ్యాయని ఎస్ఐ సుబ్బారావు తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు.. వెంకటగిరి - గూడూరురోడ్డులో వర్ధనపల్లి వద్ద పద్దాల రత్నమ్మ (60), ఆమె కుమారుడు వెంకటకృష్ణయ్య, అదే గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు ధాన్యం కాటా వేసి లారీలోకి ఎక్కిస్తున్నారు. ఇదే సమయంలో నెల్లూరుకు చెందిన శివకుమార్,చిగి కళ్యాణ్‌రెడ్డి వారాంతపు తండల్ వసూలు కోసం కారులో వెంకటగిరికి వస్తుండగా, కారు అదుపుతప్పి కాటా వేస్తున్న కూలీలపైకి దూసుకెళ్లి ముందు ఉన్న ధాన్యం లోడ్ లారీని వెనుకవైపున ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కాటా వేస్తున్న పద్దాల రత్నమ్మ, వెంకటకృష్ణయ్య, వెంకటేశ్వర్లుతో పాటు కారులో ఉన్న శివకుమార్, కళ్యాణ్‌రెడ్డి గాయపడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం వెంకటగిరి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకురాగా, చికిత్స పొందుతూ పద్దాల రత్నమ్మ మృతి చెందింది. వెంకటకృష్ణయ్యవెంకటేశ్వర్లుకు స్వల్పగాయాలు కావడంతో ప్రథమ చికిత్స చేశారు.శివకుమార్, కళ్యాణ్‌రెడ్డిని నెల్లూరులోని ఓప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సుబ్బారావు తెలిపారు.


తిరుపతిలోని జాతీయ సంస్కృత వర్సిటీలో గురువారం జరిగిన స్నాతకోత్సవంలో చాన్సలర్ గోపాలస్వామి, వీసీ కృష్ణమూర్తి నుంచి బంగారు పతకాలు అందుకుంటున్న విద్యార్థులు



పీహెచ్‌డీ పట్టాదారులు

విద్యుదాఘాతంతో రైతు మృతి


గంగయ్య (ఫైల్ ఫొటో)

కేవీబీపురం, మార్చి 20(ఆంధ్ర జ్యోతి): మండలంలోని దిగువ పూడి గ్రామానికి చెందిన గంగయ్య(44) బుధవారం రాత్రి విద్యుదాఘాతంతో తన పొలంలోనే మరణించాడు. కుటుంబ సభ్యుల కథనం మేరకు ..గంగయ్య బుధవారం రాత్రి 10గంటల సమయంలో ఇంటి వద్ద భోజనం చేసి తమ పొలంలో సాగుచేసిన శెనగ, వుచ్చ పంటలకు కావలి కాయడానికి వెళ్లాడు. కొన్ని రోజులుగా పందుల బెడద ఎక్కువగా ఉండటంతో పొలం చుట్టూ విద్యుత్ తీగలను ఏర్పాటు చేసి ట్రాన్స్‌ఫార్మర్‌కు కనెక్షన్ ఇస్తుండగా వైరు జారి కాలి పడింది. దీంతో షాక్‌కు గురై స్పృహ కోల్పోయాడు. పక్క పొలంలో తన సొంత అల్లుడు, అన్న కుమారుడు కావలి ఉన్నారు. గంగయ్య కేకలు విని వారు వెంటనే అక్కడికి చేరుకున్నారు. అంబులెన్స్‌లో శ్రీకాళహస్తి ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. మృతుడి భార్య దేశమ్మ ఫిర్యాదు మేరకు ఎస్ఐ నరేష్ కేసు నమోదు చేశారు. కాగా గంగయ్యకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

ఐదుగురిపై కేసు నమోదు

సూళ్లూరుపేట,మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మంగళంపాడు గ్రామానికి చెందిన కొమరం నారాయణస్వామి ఇంటిపైకెళ్లి దూషించిన కేసులో ఐదుగురిపై గురువారం సూళ్లూరుపేట పోలీసులు కేసు నమోదు చేశారు.బాధితుడి ఫిర్యాదు మేరకు అక్కురపాక మణికంఠ, పాలూరు రవి, లీలా మోహన్‌తో పాటు మరో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

సారా తయారీ, వినియోగం అరికడదాం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, ఎస్పీ తదితరులు

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు అర్బన్, రూరల్ మండలాలతో పాటు కార్వేటినగరం, నగరి, పుంగనూరు, కుప్పం, పులిచెర్ల మండలాల్లోని 52 గ్రామాల్లో సారా తయారీ, వినియోగం జరుగుతున్నట్లు గుర్తించామని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో నాటు సారారహిత సమాజ దిశగా ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా నవోదయం 2.0 కార్యక్రమం అమలుపై వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం జరిగింది. ఎస్పీ మణికంఠ చందోలు, జేసీ విద్యాధరి, డీఎఫ్‌వో భరణి, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ విజయశేఖర్, సూపరింటెండెంట్ శ్రీనివాస్‌తో పాటు తహసీల్దార్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ నాటుసారా నిర్మూలనలో భాగంగా 'ఎ' కేటగిరి కింద సారా తయారు చేసి ఇతర గ్రామాల్లో అమ్మకం ఎనిమిది గ్రామాల్లో జరుగుతున్నట్లు గుర్తించామన్నారు. 'బి' కేటగిరి కింద సారా తయారుచేసి అదే ప్రదేశాల్లో వినియోగించే ప్రాంతాలుగా 17 గ్రామాలను గుర్తించినట్లు వివరించారు. 'సి' కేటగిరి కింద ఇతర గ్రామాల నుంచి అక్రమ రవాణా చేసి అమ్మకం చేసే ప్రాంతాలుగా 27 గ్రామాలున్నట్లు గుర్తించామన్నారు. నవోదయం 2.0 కార్యక్రమం కింద దశలవారీగా నాటుసారా తయారీ, అమ్మకం, వినియోగం పూర్తిగా నిర్మూలించడమే ధ్యేయంగా పెట్టుకున్నామన్నారు.నల్లబెల్లం అమ్మకాలను నిర్మూలించడంతో పాటు సారా తయారీ, అమ్మకాలు జరిగే ప్రాంతాల్లో తనిఖీ చేసి, అవసరమైతే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆదేశించారు.అటవీ ప్రాంతాల్లో సారా తయారీ జరక్కుండా అటవీశాఖాధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించారు. ఇట్టివాటిపై సమాచారం తెలిసిన వెంటనే టోల్‌ఫ్రీ నెంబరు 14405కు ఫోన్‌చేసి తెలపాలన్నారు.ఎస్పీ మాట్లాడుతూ సారా తయారీదారులకు జరిమానాలు విధిస్తున్నట్లు చెప్పారు. తరచూ ఇటువంటి చర్యలకు పాల్పడితే పీడీ యాక్టు కింద కేసులు బుక్‌చేస్తామని హెచ్చరించారు.

పద్మావతి పార్కును హోల్డింగ్ పాయింట్‌గా నిర్ణయించలేదు

● భక్తులు కాకతాళీయంగా వెళ్లారు ● దురదృష్టవశాత్తు ఘటన జరిగింది
● ఏకసభ్య కమిషన్ విచారణలో పూర్వపు ఎస్పీ సుబ్బరాయుడు ● 'తొక్కిసలాట' ఘటనపై నేడూ కొనసాగనున్న విచారణ





విచారణ అనంతరం తిరిగి వెళుతున్న పూర్వపు ఎస్పీ సుబ్బరాయుడు - కమిషన్ విచారణకు హాజరైన పోలీసు, విజిలెన్సు సిబ్బంది

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 20(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో 'తొక్కిసలాట' ఘటనపై గురువారమూ ఏకసభ్య న్యాయవిచారణ కమిషన్ ఛైర్మన్ జస్టిస్ సత్యనారాయణ మూర్తి విచారణ కొనసాగించారు. అప్పటి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు నాటి సంఘటనపై వాంగ్మూలం ఇచ్చారు. 'వైకుంఠ ద్వార దర్శన టోకెన్ల పంపిణీకి తిరుపతి నగరంలో పలుచోట్ల కేంద్రాలను టీటీడీ ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా బైరాగిపట్టెడలో రామానాయుడు జడ్పీ ఉన్నత పాఠశాలలో కౌంటర్లను ఏర్పాటు చేశాం. టోకెన్ల పంపిణీకి టీటీడీ సమయం కేటాయించింది. అయితే భక్తులు కాకతాళీయంగా పద్మావతి పార్కులోకి విశ్రాంతి కోసం వెళ్లారు. బైరాగిపట్టెడలోని పద్మావతిపార్కును మేము హోల్డింగ్ పాయింట్‌గా ఏర్పాటు చేయలేదు' అని కమిషన్‌కు, క్రాస్ ఎగ్జామినేషన్ చేసిన న్యాయవాదులకు నాటి ఎస్పీ సుబ్బరాయుడు చెప్పినట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. దురదృష్టవశాత్తు సంఘటన జరిగిందని, సకాలంలోనే బాధితులను ఆస్పత్రికి తరలించి వైద్యం అందించామని ఆయన పేర్కొన్నట్లు సమాచారం. సంఘటన జరిగిన సమయంలో తాను వేరే ప్రాంతంలో బందోబస్తు పర్యవేక్షిస్తున్నానని, ఎస్పీగా పర్యవేక్షణ బాధ్యత తనదేనని, కానీ, పార్కు గేటుకు తాళాలు వేసిన నిర్ణయం తనది కాదని చెప్పినట్లు తెలిసింది. కింది స్థాయి ఉద్యోగులు నిర్ణయం తీసుకుని ఉండవచ్చని సుబ్బరాయుడు కమిషన్ దృష్టికి తీసుకొచ్చినట్లు సమాచారం. ఈ ఘటనలో సస్పెండైన డీఎస్పీ రమణకుమార్ తరపున లాయర్లు పూర్వపు ఎస్పీ సుబ్బరాయుడిని క్రాస్ ఎగ్జామినేషన్ చేసినట్లు సమాచారం. ఇక తొక్కిసలాట ఘటనలో గాయపడిన అన్నమయ్య జిల్లా రామసముద్రంకు చెందిన ముగ్గురు, వైజాగ్‌కు చందిన ఒక బాధితుడు కమిషన్ ఎదుట వాంగ్మూలం ఇచ్చారు. అప్పటి ఎస్పీ సుబ్బరాయుడు, నాటి టీటీడీ సీవీఎస్వో శ్రీధర్, పూర్వపు జేఈవో గౌతమితో పాటు ఆనాడు పార్కు వద్ద విధుల్లో ఉన్న టీటీడీ ఉద్యోగులు, విజిలెన్సు, పోలీసు సిబ్బంది పెద్దసంఖ్యలో విచారణకు వచ్చారు. కాగా, గురువారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు బాధితులను, నాటి ఎస్పీ సుబ్బరాయుడిని జస్టిస్ సత్యనారాయణమూర్తి విచారించారు. ఇక, అప్పటి టీటీడీ సీవీఎస్వో శ్రీధర్‌ను శుక్రవారం ఏకసభ్య కమిషన్ విచారించనుంది.

నీటిసమస్య పరిష్కారానికి నిధులు మంజూరు చేయండి



అధ్యక్షా..

పలమనేరు నియోజకవర్గంలో తాగునీటి సమస్య తీవ్రమవుతోంది.2014-2019 మధ్యకాలంలో కైగల్ రిజర్వాయర్ పనులకు అనుమతి రావడం, భూములు సేకరించిన తరువాత రైతులకు డబ్బులు కూడా చెల్లించి, పనులను ప్రారంభించే సమయానికి టీడీపీ ప్రభుత్వం మారడంతో ఆ పనులు అర్ధాంతరంగా ఆగిపోయాయి. కైగల్ ప్రాజెక్టును కట్టలేకపోవడంతో నీళ్లన్నీ వృధాగా తమిళనాడుకు వెళ్లిపోతున్నాయి.పలమనేరు ప్రజల తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారం కోసం గంగన్న శిరస్సు పనులు చేపట్టాలి.ఈ రెండు పనులకు త్వరిత గతిన నిధులు మంజూరు చేసి నీటిసమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి.

- అమరనాథ రెడ్డి, పలమనేరు ఎమ్మెల్యే

3 ఎంపీపీ స్థానాల ఎన్నికకు నోటిఫికేషన్ విడుదల

చిత్తూరు రూరల్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఖాళీగా ఉన్న 3 మండల పరిషత్ అధ్యక్ష(ఎంపీపీ) స్థానాలకు ఈ నెల 27వ తేదిన ఉప ఎన్నికలు జరిపేందుకు ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేసింది.తిరుపతి రూరల్, సదుం, తవణంపల్లి ఎంపీపీ స్థానాలు వీటిలో ఉన్నాయి. తిరుపతి రూరల్ ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తన పదవికి రాజీనామా చేసి అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయడంతో ఖాళీ ఏర్పడింది. సదుం ఎంపీపీ ఎల్లప్ప అనారోగ్యంతో మృతి చెందడం, తవణంపల్లి ఎంపీపీ గీత రాజీనామా చేయడంతో ఆ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. పెనుమూరు, పీలేరు మండలాల్లో కో ఆప్షన్ సభ్యుల ఎన్నిక కూడా జరగనుంది.

హైటెన్షన్ విద్యుత్ లైన్ల కింద మంటలు పెట్టడం ప్రమాదం



చిత్తూరు రూరల్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): హైటెన్షన్ విద్యుత్ లైన్ల కింద పంట వ్యర్థాలకు మంటలు పెట్టడం ప్రమాదకరమని పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ డిప్యూటీ జనరల్ మేనేజర్ రాము, అసిస్టెంట్ మేనేజర్ బరకతుల్లా తెలిపారు. గురువారం చిత్తూరు మీదుగా హైటెన్షన్ లైను కింద పంట వేసుకున్న రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా మీదుగా వెళ్తున్న పవర్ గ్రిడ్ విద్యుత్ లైన్లు ఏపీ, తమిళనాడు, కర్ణాటక, ఛత్తీస్‌గఢ్‌ని కలుపుతూ దేశంలోని అన్ని ప్రాంతాలకు జరుగుతున్న విద్యుత్ సరఫరాకు సహాయ పడుతుందన్నారు. ఇటువంటి హైటెన్షన్ విద్యుత్ లైన్ల కింద పంట వ్యర్థాలకు మంటలు పెడితే విద్యుత్‌కు అంతరాయంతోపాటు ప్రాణనష్టం జరిగే అవకాశం ఉందన్నారు. ఈ లైన్ల కింద కొబ్బరి, సవక, పామాయిల్ పంటలు వేయకూడదని, ఎటువంటి కట్టడాలు చేయొద్దని సూచించారు.

అవణి డిపాజిట్ పథకం మహిళా ఖాతాదారులకు మాత్రమే

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ)లో ఈనెల 8వ తేదీన అవణి పథకాన్ని ప్రారంభించినట్లు గిరింపేట బ్రాంచ్ మేనేజర్ రఘుబాబు తెలిపారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. ఈ పథకాన్ని మహిళా ఖాతాదారులకు మాత్రమే అమలు చేస్తామన్నారు. ఈనెల 31వ తేదీవరకు డిపాజిట్ల సేకరణ జరుగుతోందని చెప్పారు. మహిళల పేరిట రూ.10వేలు లేదా అంతకుపైబడి నగదు డిపాజిట్ చేయవచ్చన్నారు. ఇందుకు ఇన్సూరెన్స్ సౌకర్యం ఉందన్నారు. ఈ పథకం 333 రోజులకు ఉంటుందన్నారు. వాణిజ్య బ్యాంకుల కంటే అదనంగా 8.30 శాతం, సీనియర్ సిటిజన్లకు 8.40 శాతం వడ్డీ చెల్లిస్తామని వివరించారు. ఇతర వివరాలకు బ్యాంకు బ్రాంచ్‌ల్లో సంప్రదించాలని సూచించారు.

నడకదారిలో పాము



అలిపిరి కాలినడక మార్గంలో గురువారం ఎనిమిది అడుగుల జెర్రిపోతు పాము పట్టుబడింది. గాలిగోపురం వద్దనున్న ఓ దుకాణంలోకి ప్రవేశించిన పామును భాస్కర్ నాయుడు బంధించి అడవిలో వదిలారు. అలాగే తిరుమలలోని మేదరమిట్ట ప్రాంతంలోని బరోడా బ్యాంక్‌పై భాగంలో ఉన్న హెల్త్ కార్యాలయంలో కూడా జెర్రిపోతును భాస్కర్‌నాయుడు పట్టుకున్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

కాలినడకమార్గంలో పట్టుబడిన జెర్రిపోతు - మేదరమిట్ట వద్ద..





మాధవరంలో యంత్రం సాయంతో వరినాటు వేస్తున్న రైతు - పన్నూరులో యంత్రంతో వరి నూర్పిడి చేస్తున్న రైతులు

సేద్యానికి సాంకేతిక సాయం



జీఎం పురంలో డ్రోన్‌తో మందుల పిచికారి

విజయపురం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): రైతన్నలు వ్యవసాయ రంగంలో సాంకేతికత వైపు అడుగులు వేస్తున్నారు. విజయపురం మండలంలో అయితే వరినాటు మొదలుకుని అన్ని పనులు పరికరాలతో చేస్తున్నారు. వరినాటుకు ఎకరాకు రూ.2వేల నుంచి రూ.2,500 వరకు ఖర్చవుతుందని రైతులు చెబుతున్నారు. కొందరు డ్రమ్ సీడర్ ద్వారా విత్తనాలు చల్లుతున్నారు. కలుపు తీయడానికి వీడర్లు వాడుతున్నారు. వరి నూర్పిడి చేయడానికి కూడా యంత్రాలనే ఎక్కువగా వినియోగిస్తున్నారు. ప్రారంభంలో యంత్రాలతో సేద్యం చేయడానికి రైతులు ఆలోచించేవారు. ప్రస్తుతం ఎక్కువమంది యంత్రాల కోసం ఎదురు చూస్తున్నారు. కూలీల ఖర్చులు ఎక్కువ కావడం, యంత్రాలు విరివిగా లభించడంతో ఇటువైపు మొగ్గు చూపుతున్నారు. వ్యవసాయ పరికరాలను ప్రభుత్వం 50 శాతం రాయితీలో సరఫరా చేయడం వల్ల పెద్దకారు రైతులు సొంతంగా యంత్రాలు కొనుగోలు చేసుకుంటున్నారు. కొందరు సన్న, చిన్నకారు రైతులు కూడా యంత్రాలను కొనుగోలు చేస్తున్నారు. వీరు తమ పని పూర్తయ్యాక బాడుగలకు ఇస్తూ అదనపు లబ్ధి పొందుతున్నారు.

భర్త ఇంటి ఎదుట భార్య ధర్నా

● పెళ్లైన 9 నెలలకే వదిలించుకోవడానికి యత్నించడంపై నిరసన



భర్త ఇంటి ఎదుట బైటాయించిన భార్య రమ్యశ్రీ, కుటుంబ సభ్యులు

గంగవరం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ప్రేమించి పెళ్లి చేసుకొని 9 నెలలకు వదిలించుకోవడానికి ప్రయత్నిస్తున్నాడని ఆరోపిస్తూ బాధిత మహిళ తన భర్త ఇంటి ఎదుట కుటుంబ సభ్యులతో బైఠాయించి ధర్నా చేసింది. బాధితురాలి కథనం మేరకు .. గంగవరానికి చెందిన శ్రీనివాసులు కుమారుడు భరత్, మబ్బువాళ్ల పేట గ్రామానికి చెందిన నాగరాజు కుమార్తె రమ్యశ్రీ ఇరువురూ ప్రేమించి గత ఏడాది జూన్‌లో తిరుపతిలో అలిపిరి మెట్ల వద్ద వివాహం చేసుకున్నారు. ఇరువురిది వేర్వేరు కులాలు కావడంతో వారి పెద్దలు అంగీకరించలేదు. దీంతో బెంగళూరుకు వెళ్లిపోయారు. అక్కడ నాలుగు నెలల అనంతరం ముళబాగల్‌లో కాపురం ఉన్నారు. గత నెల రోజుల క్రితం భరత్ తల్లిదండ్రుల వద్దకు వెళ్లొస్తానని వెళ్లి మళ్లీ తిరిగి రాలేదు. దీంతో అనుమానం వచ్చి వారి ఇంటి వద్దకు వెళ్లి భర్త ఆచూకీ కోసం ఆరా తీశారు. జరిగింది పెళ్లికాదని.. 9 నెలలు కాపురం చేసినందుకు ఎంతో కొంత నగదు ఇస్తామని.. తమకు వద్దంటూ భర్త, వారి కుటుంబసభ్యులు తిట్టారు. దీంతో తనకు మాయమాటలు చెప్పి వివాహం చేసుకుని వదిలించుకోవాలని చూస్తున్న తన భర్తపై చర్యలు తీసుకోవాలని.. తనకు న్యాయం చేయాలని కోరుతూ భర్త ఇంటివద్దే బైఠాయించి ధర్నా చేపట్టారు. గంగవరం పోలీసులకు బాధితురాలితోపాటు వారి కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. విచారణ చేపడుతున్నట్లు గంగవరం సీఐ ప్రసాద్ తెలిపారు.

సంబంధం లేని పనులు అప్పగించొద్దు

కలెక్టర్‌కు వీఆర్వోల సంఘం వినతి



కలెక్టర్‌కు వినతిపత్రమిస్తున్న వీఆర్వోలు

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): సంబంధం లేని పనులను తమకు అప్పగించొద్దని గ్రామ రెవెన్యూ అధికారు(వీఆర్వో)ల సంఘ నాయకులు విన్నవించారు. ఈ మేరకు గురువారం సాయంత్రం రాష్ట్ర కమిటీ పిలుపుతో కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. క్లస్టర్ విధానంలో రెండు సచివాలయాలకు కలిపి ఒకే వీఆర్వో ద్వారా మ్యాపింగ్ చేస్తుండటంతో తీవ్ర ఇబ్బందులతోపాటు పనిభారం పెరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఖాళీగా ఉన్న సీనియర్ అసిస్టెంట్ పోస్టులను వన్‌టైం సెటిల్‌మెంట్ కింద పదోన్నతులు ఇవ్వాలన్నారు. డీగ్రేడ్ చేసిన సీనియర్ సహాయకుల 54 పోస్టులను పునరుద్ధరించడానికి ప్రభుత్వానికి సిఫార్సు చేయాలని కోరారు. సమస్యలపై కలెక్టర్ సానుకూలంగా స్పందించారు.జిల్లా అధ్యక్షుడు జి.రాజశేఖర్, ప్రధానకార్యదర్శి ఎం.శరత్ కుమార్, వైస్ ప్రెసిడెంట్ వెంకటముని, జాయింట్ సెక్రటరీ ఎం.ఉమామహేశ్వరి, కోశాధికారి కె.దామోదరం, చిత్తూరు డివిజన్ అధ్యక్షుడు కరుణాకరన్,వీఆర్వోలు నరేష్, హేమంత్,శోభన్‌బాబు పాల్గొన్నారు.

ఐసీడీఎస్ అధికారుల చెంతకు శిశువు



శిశువును ఐసీడీఎస్ అధికారులకు అప్పగిస్తున్న రుయా అధికారులు

తిరుపతి(వైద్యం), మార్చి 20 (ఆంధ్రజ్యోతి): బాలికకు పుట్టిన మగబిడ్డకు రుయాస్పత్రిలో 35 రోజులు చికిత్స అందించి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉండటంతో గురువారం రుయా అధికారులు ఐసీడీఎస్ అధికారులకు అప్పగించారు. పలమనేరు మండలానికి చెందిన బాలిక గర్భందాల్చి ఆరోగ్య పరిస్థితి విషమించడంతో గత నెల 15న చిత్తూరులోని ప్రభుత్వ ఆస్పత్రిలో శస్త్ర చికిత్స చేసి బిడ్డను బయటకు తీసిన విషయం తెలిసిందే. అప్పటికే బాలిక పరిస్థితి విషమంగా మారడంతో మెరుగైన చికిత్స నిమిత్తం ఫిబ్రవరి 16న రుయాస్పత్రికి తీసుకువచ్చారు. ఇక్కడ చికిత్స పొందుతూ బాలిక మృతిచెందిన విషయం తెలిసిందే. బిడ్డను చిన్నపిల్లల విభాగంలో ఉంచి చికిత్స అందించారు. శిశువు కోలుకోవడంతో ఆస్పత్రి అడ్మినిస్ట్రేటర్ కనకనరసారెడ్డి, సీఎస్ఆర్ఎంవో సుబ్బలక్ష్మమ్మ, డీసీఎస్ ఆర్ఎంవో శ్రీనివాసులు ఐసీడీఎస్ అధికారులకు అప్పగించారు. ఏఆర్ఎంవో హరికృష్ణ పాల్గొన్నారు.

నలుగురు ఎర్రచందనం కూలీల పట్టివేత



కల్లూరు స్టేషన్‌లో ఎర్రచందనం కూలీలు

కల్లూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం కల్లూరు పట్టణ నడిబొడ్డున గురువారం సాయంత్రం నలుగురు ఎర్రచందనం కూలీలను పోలీసులు పట్టుకున్నారు. సుమారు 100 కిలోల బరువున్న నాలుగు ఎర్రచందనం దుంగలు, ఓ కారును స్వాధీనం చేసుకున్నారు.శేషాచలం అటవీప్రాంతం నుంచి దేవరకొండ మార్గంలో జంగంవారికొండ సమీపంలో వెళుతున్న తమిళనాడు రాష్ట్రానికి చెందిన ఓ కారును టాస్క్‌ఫోర్స్ ఎస్‌ఐ వాసు గుర్తించారు. పులిచెర్ల వైపు వెళుతుందన్న అనుమానంతో ఆ కారు ఫొటో తీసి కల్లూరు సీఐ సూర్యనారాయణకు పంపారు.దీంతో కల్లూరు పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. కల్లూరు సమీపంలోని ప్రభుత్వాస్పత్రి వద్ద వేగంగా వస్తున్న తమిళనాడుకు చెందిన కారును పోలీసులు ఆపే ప్రయత్నం చేశారు. అయినా కారు ఆగకుండా ముందుకు వెళ్లడంతో కల్లూరు నాలుగురోడ్ల కూడలి సమీపంలోని పులిచెర్ల రోడ్డులో వాహనాలను రోడ్డుకు అడ్డుపెట్టారు. దీంతో కారు ఆగిపోగా లోపలున్న కారులో ఉన్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు.అప్పటికే ముగ్గురు పరారైనట్లు గుర్తించి వెంటాడారు.పాళెం సమీపంలోని పొలాల్లో దాక్కున్న ఒకరిని పట్టుకొని స్టేషన్‌కు తీసుకొచ్చారు. అలాగే కారును, అందులో వున్న 100 కేజీల బరువున్న నాలుగు ఎర్రచందనం దుంగలను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.అప్పటికే ఎర్రచందనం టాస్క్‌ఫోర్స్ ఎస్‌ఐ వాసు కల్లూరుకు చేరుకొని అదుపులో ఉన్న నలుగురిని విచారించి తిరుపతికి తీసుకెళ్లారు. వారు తమిళనాడు రాష్ట్రం ధర్మపురి జిల్లాకు చెందిన రామస్వామి కార్తీక్ (37), తీర్థగిరి మగలింగం (38), చిన్న అన్నామలై ఎలంగోవన్ (37), కుప్పుస్వామి మాదవ్ (42)గా గుర్తించారు. పరారైన ఇద్దరు ధర్మపురి జిల్లాకు చెందిన అన్నప్పన్ (44), అన్నామలై (40)గా తేలింది.

విద్యార్థినుల పట్ల అసభ్య ప్రవర్తన

టీచరు తీరుపై తిరగబడ్డ గ్రామస్తులు - నేడు హైస్కూల్లో విద్యాశాఖ అధికారుల విచారణ

గంగవరం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): విద్యాబుద్ధులు నేర్పాల్సిన గురువులే విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించడంపై గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన ఘటన గంగవరం మండలం మామడుగు హైస్కూల్‌లో గురువారం చోటుచేసుకొంది. గోవిందశెట్టిపల్లెకు చెందిన పలువురు విద్యార్థులు మామడుగు హైస్కూల్‌కు వస్తుంటారు. హైస్కూల్‌లో పనిచేసే ఓ ఉపాధ్యాయుడు వింతగా మాట్లాడడంతో పాటు వింతగా ప్రవర్తించడంతో విద్యార్థినులు వారి కుటుంబ సభ్యులకు చెప్పారు. దీంతో పలువురు గ్రామస్థులు హైస్కూల్ వద్దకు వచ్చి ఆ ఉపాధ్యాయుడిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. దీంతో ఉద్రిక్త వాతావరణం నెలకొనడంతో గంగవరం పోలీసులు, విద్యాశాఖ అధికారులు అక్కడకు చేరుకొని గ్రామస్తులకు నచ్చజెప్పారు.పిల్లలకు ఇబ్బందులు ఎదురైై ఉంటే పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయండని సూచించారు. ఈ విషయంపై మండల విద్యాశాఖ అధికారులు డీవైఈఓ తో పాటు జిల్లా విద్యాశాఖ అధికారులకు నివేదించారు. ఈ నేపథ్యంలో శుక్రవారం హైస్కూల్‌లో విచారణ జరిపి విద్యార్థులు, వారి తల్లిదండ్రుల అభిప్రాయాలతో కూడిన నివేదికలు అందజేయాలని జిల్లా విద్యాశాఖ అధికారులు ఆదేశించారని గంగవరం ఎంఈఓ-2 శ్రీనివాసులు తెలిపారు.

పేలిన ఆర్టీసీ బస్సు టైరు

ప్రయాణికులు సురక్షితం



వెదురుకుప్పం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు వెనుక చక్రం టైరు ఉన్నట్లుండి పేలిపోయిం ది. అందులోని ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. చిత్తూరు వైపు నుంచి పుత్తూరుకు కార్వేటినగరం మీదుగా గురువారం బస్సు వెళ్తోంది. కార్వేటినగరం సమీపంలో కల్వర్టు ఉన్న ప్రాంతానికి వచ్చాక వెనుక చక్రం టైరు పేలిపోయి పెద్ద శబ్దం వచ్చింది. డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించి, బస్సును పక్కకు తిప్పి ఆపేశారు. ప్రయాణికులకు ఏం జరిగిందో కొంతసేపు అర్థం కాలేదు. అందరూ సురక్షితంగా బయటపడటంతో ఊపిరి పీల్చుకున్నారు.

మండలాలకు రాయితీ మామిడి కవర్లు


సూరయ్యగారిపల్లికు చేరుకున్న మామిడి కాయల కవర్లు

సోమల, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందించే 50 శాతం రాయితీ మామిడి కవర్లు పంపిణీకి సిద్ధంగా ఆయా మండలాలకు చేరుకున్నట్లు చౌడేపల్లె ఉద్యాన శాఖాధికారిణి సంతోష్ కుమారి తెలిపారు. గురువారం సోమల మండలంలోని రైతులకు సూరయ్యగారిపల్లె సచివాలయానికి, పులిచెర్ల మండలానికి దేవలంపేట సచివాలయం వద్ద, చౌడేపల్లెకు కవర్లు చేరుకున్నాయన్నారు. రైతుకు రెండున్నర ఎకరాలకు 10 వేల కవర్లు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఒక కవరుకు రాయితీ ధర రూపాయి మాత్రమే చెల్లిస్తే చాలని, మామిడి కాయలు నిమ్మకాయ సైజులో ఉన్నప్పుడు కాయలకు కవర్లు కట్టడంతో కాయ మంచి రంగు, నాణ్యత కలిగి మార్కెట్‌లో అధిక ధర పలుకుతుందని వివరించారు. రైతులు తమ పరిధిలోని రైతుసేవా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు.

'పిచ్చుక జాతిని సంరక్షించుకుందాం'



ప్లకార్డులను ప్రదర్శిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

కల్లూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): అంతరించిపోతున్న పిచ్చుక జాతిని సంరక్షించుకుందామని కల్లూరు జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం శ్రీవాణి, ఎన్‌జీసీ డివిజనల్ కన్వీనర్ రాజేంద్ర, గ్రీన్‌మాస్టర్ వెంకటశిద్దులు తెలిపారు. పులిచెర్ల మండలం కల్లూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం అంతర్జాతీయ పిచ్చుకల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా పిచ్చుకల ప్రాముఖ్యతపై విద్యార్థులతో ర్యాలీ, ప్లకార్డుల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ సెల్ టవర్లు, పెరిగిన కాలుష్యం, క్రిమి సంహారక మందులతో పిచ్చుకలు అంతరించిపోతున్నాయన్నారు. పర్యావరణానికి మేలు చేస్తూ జీవవైవిధ్య సమతుల్యతను కాపాడటంలో పిచ్చుకలు ప్రముఖపాత్ర పోషిస్తాయన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రహమత్‌బాషా, హయత్‌బాషా, వేణుగోపాల్, రాజశేఖర్, చలపతి, రేణుకాదేవి, విద్యార్థులు పాల్గొన్నారు.

వారపుసంత వేలంతో రూ.5.73 లక్షల ఆదాయం


ఎల్లంకివారిపల్లిలో వారపుసంతకు వేలం నిర్వహిస్తున్న అధికారులు

కల్లూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం మంగళంపేట, ఎల్లంకివారిపల్లి పంచాయతీల్లో వారపుసంత, ప్రైవేటు బస్టాండు గేటు వేలంతో రూ.5.73 లక్షలు ఆదాయం లభించినట్లు పంచాయతీ కార్యదర్శులు శ్రీబాబు, నాగరాజు తెలిపారు. మండలంలోని మంగళంపేట, ఎల్లంకివారిపల్లి సచివాలయాల్లో గురువారం ఇన్‌చార్జి ఎంపీడీవో రాజశేఖర్‌బాబు ఆధ్వర్యంలో వారపుసంత, బస్టాండు గేటు రుసుం వసూలు చేసుకొను హక్కులపై బహిరంగ వేలం నిర్వహించారు. పంచాయతీలకు వచ్చిన ఆదాయాన్ని పంచాయతీ అభివృద్ధికి ఖర్చు పెట్టడం జరుగుతుందని ఎంపీడీవో తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు శ్రీబాబు, దినేష్, నాగరాజు, శివశంకర్‌రెడ్డి, సర్పంచ్ మధు, ఎంపీటీసీ సభ్యులు మునికృష్ణమనాయుడు పాల్గొన్నారు.

ఇళ్లు కోల్పోయిన బాధితులకు న్యాయం చేయాలి


నిరసన తెలుపుతున్న బాధితులు, బహుజనసేన నేతలు

శాంతిపురం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మఠం పంచాయతీ సంతూరు చెరువులో ఇళ్లు కోల్పోయిన బాధితులకు న్యాయం చేయాలని బహుజనసేన నేతలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం బాధితులతో కలిసి బహుజనసేన నేతలు మండల సచివాలయం వద్ద నిరసన తెలిపారు. అంతకుముందు బాధితులు బహుజనసేన నేతలు కలిసి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి మండల సచివాలయం వరకు ర్యాలీ నిర్వహించి మండల పరిషత్తు కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. రాళ్లబూదుగూరు ఎస్‌ఐ నరేష్, తహసీల్దార్ శివయ్య, ఎంపీడీవో కుమార్ చేరుకుని బాధితులకు నచ్చచెప్పారు. నిరుపేదలకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం తహసీల్దార్ శివయ్య, ఎంపీడీవో కుమార్‌కు వినతిపత్రాలు అందించారు. కార్యక్రమంలో బహుజనసేన నేతలు, బాధితులు పాల్గొన్నారు.

ఏప్రిల్ లోపు గృహనిర్మాణాలు పూర్తిచేయాలి

శాంతిపురం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : గత టీడీపీ ప్రభుత్వంలో ఎన్టీఆర్ గృహనిర్మాణ పథకంలో మంజూరైన గృహాలను ఏప్రిల్ నెలాఖరుకు పూర్తి చేయాలని ఎంపీడీవో ఏపీఆర్ కుమార్ తెలిపారు. గురువారం ఎంపీడీవో గృహనిర్మాణశాఖ అధికారులతో కలిసి శివరామపురం పంచాయతీ గట్టూరు గ్రామంలో అసంపూర్తిగా ఉన్న, ఇంతవరకు ప్రారంభం కాని నిర్మాణాలను ఆయన పరిశీలించారు. గతంలో ప్రభుత్వం ఇస్తున్న యూనిట్ ధరకు అదనంగా మరో రూ.75 వేలు మంజూరు చేసిందన్నారు. ప్రస్తుతం ఎస్సీ, బీసీలకు రూ.2,30,000 ఇస్తారని, ఎస్టీలకు రూ.2,55,000 ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గిరిబాబు, ఇంజనీరింగ్ సహాయకులు హరికృష్ణ, సంక్షేమ సహాయకులు రమేష్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

వైభవంగా నలగుండ్రాయస్వామి పుష్పపల్లకీసేవ


విశేషాలంకరణలో ఉత్సవమూర్తులు

బైరెడ్డిపల్లె, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కడపనత్తం గ్రామంలో కొలువైవున్న నలగుండ్రాయస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో ప్రధానమైన పుష్పపల్లకీసేవ బుధవారం రాత్రి వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా అలివేలుమంగ, పద్మావతీసమేత నలగుండ్రాయస్వామి ఉత్సవమూర్తులకు అర్చకులు విశేషాలంకరణగావించి ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం వివిధరకాల పుష్పాలు, విద్యుద్దీపాలతో సుందరంగా తీర్చిదిద్దిన పల్లకీలో స్వామివారిని కొలువుదీర్చి మేళతాళాల మధ్య పురవీధుల్లో ఊరేగించారు. పరిసర గ్రామాలనుంచి పలువురు భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయంవద్ద నిర్వాహకులు అన్నదాన కార్యక్రమం ఏర్పాటుచేశారు. ఆలయధర్మకర్త మురళీస్వామి, కమిటీసభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

24న ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు

బైరెడ్డిపల్లె, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): బైరెడ్డిపల్లె ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో మహతి ఫౌండేషన్ సహకారంతో బెంగళూరు వైదేహి ఆస్పత్రి వైద్యులచే 24వతేదీ ఉదయం 10 గంటలకు ఉచిత క్యాన్సర్ నిర్ధారణ వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు నాగరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎంపీడీవోకు ఘన సన్మానం


ఎంపీడీవోను సన్మానిస్తున్న కురబ కుల సంఘం నేతలు

శాంతిపురం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) శాంతిపురం ఎంపీడీవో కుమార్‌ను మండల కురబ కుల సంఘం నేతలు గురువారం ఎంపీడీవో కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. కదిరిముత్తనపల్లె గ్రామంలో ఈనెల 13, 14 తేదీలలో జరిగిన కురబ కులస్తుల పెద్దదేవర జాతరకు పంచాయతీ రాజ్ శాఖ తరఫున తాగునీరు, వీధిదీపాలు, శానిటేషన్ ఇతర పనులు చేపట్టి ప్రజలకు ఎలాంటి అసౌకర్యం లేకుండా సమర్థవంతంగా చర్యలు తీసుకున్నందుకు ఎంపీడీవోకు ధన్యవాదాలు తెలిపారు. నూతనంగా వేసిన తాగునీటి బోరుకు అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని కోరారు. స్పందించిన ఎంపీడీవో రెస్కో అధికారులతో మాట్లాడి ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయిస్తామని తెలిపారు. మునిరత్నం, వెంకటపతి పాల్గొన్నారు.

సదరం శిబిరాన్ని వినియోగించుకోవాలి

కుప్పం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం సూచనల ప్రకారం కుప్పం ప్రభుత్వాసుపత్రిలో శుక్ర, ఆది వారాలలో నిర్వహించనున్న సదరం శిబిరం నియోజకవర్గ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ వి.శ్రీనివాసరావు, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ జిమ్ దాము, కౌన్సిలర్ ఎమ్మార్.సురేశ్‌లు కోరారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో గురువారం వారు సదరం శిబిరం ప్రచార పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గుడుపల్లె, శాంతిపురం, రామకుప్పం మండలాలకు శుక్రవారం, కుప్పం రూరల్, మున్సిపాలిటీలకు 22వ తేదీన ఉదయం 9 గంటలనుంచి సదరం శిబిరం నిర్వహిస్తారని చెప్పారు. వృద్ధులు, దివ్యాంగులకు ధ్రువీకరణ పత్రాలు జారీ చేయడానికి నిర్వహించే ఈ శిబిరంలో పాల్గొని ఆయా పత్రాలు పొందాలని సూచించారు.

● రామకుప్పం : రాష్ట్ర ప్రభుత్వం కుప్పం నియోజకవర్గంలోని దివ్యాంగులకు ధ్రువీకరణ పత్రాలు అందించేందుకు కుప్పంలో రెండు రోజుల పాటు సదరం క్యాంపు నిర్వహిస్తున్నట్లు రామకుప్పం ఎంపీడీవో మురళధర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, తిరిగి మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5గంటల వరకు నిర్వహించే సదరం క్యాంపునకు రామకుప్పం మండలంలోని దివ్యాంగులు హాజరై ధ్రువపత్రాలు పొందాలని ఆయన కోరారు. దివ్యాంగులు తమ వెంట ఆధార్‌కార్డు, తెల్లరేషన్‌కార్డు, 4 పాసుపోర్టు ఫోటోలు, ఇదివరకు ఏదైనా వైద్యుల వద్ద చికిత్స పొందిన రిపోర్టులు, సదరం స్లాట్ కాపీని తమ వెంట తీసుకురావాలని ఆయన కోరారు.

కేజీబీవీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కుప్పం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): కుప్పం మండలం పరమసముద్రం గ్రామంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో 6, 11 తరగతుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎం.విజయలక్ష్మి తెలిపారు. దరఖాస్తులను ఆన్‌లైన్‌లో ఈనెల 22 నుంచి ఏప్రిల్ 11 వరకు స్వీకరిస్తామన్నారు. అర్హులైన బాలికలు, అనాథలు, బడిబయటి పిల్లలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, బీపీఎల్‌కు చెందినవారు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 2300275247, 9885376550 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

● రామకుప్పం: రామకుప్పం మండలంలోని విజలాపురం కస్తూర్బా బాలికల గురుకుల విద్యాలయంలో ప్రవేశం కోరే విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ అమరావతి కోరారు. ఆరో తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఎంపీసీ గ్రూపులలో ప్రవేశం కోరే అనాథ, బడిబయట పిల్లలు, డ్రాపౌట్, పేద, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ పిల్లలు 22 నుంచి ఏప్రిల్ 11 వరకు వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

పరిశుభ్ర పంచాయతీలకు సహకరించండి


సమావేశంలో మాట్లాడుతున్న మణి

కుప్పం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): పంచాయతీలను పరిశుభ్రంగా, స్వచ్ఛంగా ఉంచాలనుకుంటున్న ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశయానికి సహకరించాలని రాష్ట్ర తెలుగు యువత కార్య నిర్వాహక కార్యదర్శి చెక్కునత్తం మణి కోరారు. కుప్పం మండలం చెక్కునత్తం పంచాయతీ సచివాలయంలో గురువారం స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ ప్లాస్టిక్ చెత్తబుట్టలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామాలు స్వచ్ఛంగా ఉంటేనే ఆరోగ్యం, ఆనందం చేకూరుతుందని చెప్పారు. కార్యక్రమంలో వీఆర్వో మహేశ్, పంచాయతీ కార్యదర్శి మురళి, సచివాలయ సిబ్బంది, నాయకులు మునిరత్నం, దేవేంద్ర, బాలు, వెంకటాచలం, బీరప్ప, రాము, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ కార్యవర్గం ఏకగ్రీవం


భాస్కర్


భరకత్‌బీ

గంగవరం, మార్చి 20 (ఆంధ్ర జ్యోతి): పలమనేరు బార్ అసోసియేషన్ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు అసోసియేషన్ గౌరవాధ్యక్షులు లక్ష్మీపతి తెలిపారు. గురువారం పలమనేరులో ఆయన ఆధ్వర్యంలో బార్ అసోసియేషన్ కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. నూతన బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా యల్.భాస్కర్, ఉపాధ్యక్షులుగా వి.చంద్రశేఖర్, షరీఫ్, జనరల్ సెక్రటరీగా యస్.బరకత్‌బీ, జాయింట్ సెక్రటరీగా జి.ఆర్.రవి, ట్రెజరర్‌గా ఫామిద్‌బాషా, లైబ్రేరియన్‌గా సీయస్.ఇబ్రహీం, మహిళా రెప్రజెంటేటివ్‌గా మహేశ్వరి, క్రీడా, కల్చరల్ సెక్రటరీగా రంజిత్‌షాలను నూతనంగా ఎంపిక చేశారు. న్యాయవాదుల హక్కులు కాపాడటానికి కృషిచేస్తామన్నారు.

చిన్నచెల్లారగుంటలో వైద్యసేవలు


వైద్య సేవలు అందిస్తున్న వైద్యులు

బైరెడ్డిపల్లె, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నచెల్లారగుంట గ్రామంలో గురువారం తీర్థం పీహెచ్‌సీ వైద్యాధికారి అరుణ్‌కుమార్ వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. సాధారణ, దీర్ఘకాలిక వ్యాధులున్న వారికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. నీరు ఎక్కువగా తాగాలని, ఎండలో వెళ్లేటప్పుడు టోపీ, గొడుగు వినియోగించాలని, చిన్నపిల్లలు, వృద్ధులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వివరించారు. ఆరోగ్యవిద్యాధికారి కాంతమ్మ, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

మండుటెండలు ఆరంభం..!

● వేసవిలో పెరుగుతున్న ఉష్ణోగ్రతలు ● ముంచుకొస్తున్న అగ్ని ప్రమాదాలు

● రైతులకు పంట నష్టం


మధురమలై కొండలో మంటలు


మేటిమందలో ప్రమాదంలో కాలిన పైపులు


కందూరులో కాలిన మామిడి చెట్లు

సోమల, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): వేసవి ఆరంభంతోనే అగ్ని ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయి. ప్రమాదాలతో రైతులకు అధిక నష్టం జరుగుతోంది. ఏప్రిల్, మే నెలల్లో మరింత పెరగనున్న ఉష్ణోగ్రతలతో మరిన్ని ప్రమాదాలుజరిగే అవకాశాలున్నాయి. ప్రమాదం జరిగిన వెంటనే నివారించడానికి అగ్నిమాపక కేంద్రాలు దగ్గరలో లేవు. నియోజకవర్గం కేంద్రాల్లోనే ఉన్నాయి. పుంగనూరులో ఉన్న వాహనం ప్రమాదం జరిగిన చోటుకు రావడానికి కొంత సమయం పడుతుంది. అంతలోపు నష్టం జరిగిపోయే పరిస్థితి ఉంది. సోమల మండల కేంద్రానికి 35 కిలోమీటర్లు, సదుం మండలానికి 50 కిలోమీటర్లు, పులిచెర్లకు 70 కిలోమీటర్లు దూరంలో ఉన్నాయి. ఇక అక్కడి నుంచి ఇతర చోట్లకు మరింత దూరం పెరగనుంది. ఇటీవల సోమల-సదుం మార్గంలోని రోడ్డుకు ఇరువైపులా ఎండిన గడ్డికి నిప్పు పెట్టడంతో పలువురి మామిడి తోటల్లోకి మంటలు వ్యాపించి భారీ నష్టం జరిగింది. అలాగే బంగారు తిరుత్తణి కొండకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో అటవీ సంపదతో పాటు పలువురి రైతుల మామిడి, టమోటా తోటలు దెబ్బతిన్నాయి. సోమల- కందూరు మార్గంలోని ఉప్పరపల్లె గుట్టకు నిప్పు పెట్టడంతో ఆసమీప రైతుల మామిడి తోటలకు తీవ్ర నష్టం జరిగింది. వారం క్రితం ఇరికిపెంట చెన్నపట్నం చెరువు సమీపం మధురమలై కొండకు నిప్పు పెట్టడంతో పలువురి రైతుల పొలాల వద్దకు మంటలు వ్యాపించి టమోటా తోటల్లోని పీవీసీ పైపులు, డ్రిప్ పైపులు అగ్నికి ఆహుతయ్యాయి. బుధవారం రాత్రి సోమల మండలం కుప్పకొండ సమీపంలో మంటలు వ్యాపించి టమోటా తోటలో ఊతంగా నాటేందుకు సిద్ధం చేసిన కర్రలు కాలిపోయాయి. అలాగే బంగారు తిరుత్తణి కొండ సమీపంలోని పువ్వా సుబ్రహ్మణ్యంశెట్టి మామిడి తోటలో కొన్ని చెట్లు కాలిపోయాయి. రైతులు మంటలు ఆర్పేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. ప్రమాదంలో తీవ్ర నష్టం జరిగింది. చెట్లు నుంచి ఆకులు రాలిపోవడంతో అగ్ని తగిలిన వెంటనే ప్రమాదం మరింత వేగంగా పుంజుకుంటుంది. అధికారులు ప్రమాద స్థలాలను గుర్తించిన వెంటనే స్పందించాల్సి ఉంది. అటవీ శివారు గ్రామాల ప్రజలకు అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించాలి.

పొలాల వద్ద భయం భయం



మా మామిడితోట సమీపంలో ఉప్పరపల్లెగుట్టకు ఎవరో నిప్పు పెట్టారు. గుట్టంతా కాలిపోయి మంటలు మా తోటలోకి వచ్చేశాయి. రెండు సార్లు మందులు కొట్టిన 25 చెట్లు కాలిపోయాయి. నష్టపరిహారం కోసం దరఖాస్తు చేయలేదు. మా పక్క పొలం వారివి 20 చెట్లు కాలిపోయాయి. మంటలు ఆర్పేందుకు వీలు పడలేదు. ఏటా ప్రమాదాలు జరుగుతున్నాయి. అగ్నిమాపక కేంద్రం పుంగనూరులో ఉంది. అందుబాటులో లేక ఇబ్బందులు పడుతున్నాం. వేసవి రాక ముందే ఎండలు ముదురుతున్నాయి. పశువులకు పచ్చి మేత కరవై అడవులకు వెళ్లి అడవి బోదను తెచ్చుకుంటున్నాం. మాకు సమీపంలోని బంగారు తిరుత్తణి కొండకు నిప్పు పెట్టడంతో అడవి అంతా కాలిపోయింది.

- డి.మనోహర్, సోమల

సమాచారం ఇస్తే వెంటనే చర్యలు



కొండలు, గుట్టల్లో పశువుల గొర్రెల కాపర్లు ఎండు గడ్డికి నిప్పు పెడుతున్నట్లు మా దృష్టికి వచ్చింది. దీంతో అగ్ని ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. అగ్ని ప్రమాదాల పై అవగాహన కల్పిస్తున్నాం. ప్రమాదం జరిగిన వెంటే సమాచారం ఇస్తే ఘటన స్థలానికి చేరుకుంటాం. ప్రజలు సహకరించాలి. ఫోన్‌నంబర్లు 8500445101, 9963736640 లను సంప్రదిస్తే వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుంటాం.

- ఎన్.సుబ్బరాజు,
అగ్నిమాపక శాఖ అధికారి, పుంగనూరు

చిన్నారుల ఆరోగ్యం అందరి లక్ష్యం




కల్లూరులో మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఎంపీడీవో , చౌడేపల్లెలో సూపర్‌వైజర్లు

కల్లూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): చిన్నారుల ఆరోగ్యవంతమైన జీవనం మనందరి లక్ష్యం కావాలని ఇన్‌చార్జి ఎంపీడీవో రాజశేఖర్‌బాబు, ఎంఈవోలు శిద్దరామయ్య, పోకల తాతయ్య తెలిపారు. పులిచెర్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం అంగన్‌వాడీ కార్యకర్తలకు పోషణ్ బి-పఢాయ్ బి మూడు రోజుల శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్నారుల్లోని పౌష్టికాహార లోపంపై జరుగుతున్న పోరాటంలో ప్రజలంతా పాలుపంచుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల బరువు, ఎత్తు తదితర వివరాలను పోషన్ ట్రాకర్‌లో నమోదు చేయాలన్నారు. రక్తహీనతపై అవగాహన కల్పించాలన్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు బాలామృతం సక్రమంగా అందజేయాలన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు విజయలక్ష్మీ, రమాదేవి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

● చౌడేపల్లె: చిన్నారుల ఆరోగ్యమే లక్ష్యంగా అంగన్‌వాడీ కార్యకర్తలు పనిచేయాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రమాదేవి, సులోచనలు పేర్కొన్నారు. గురువారం వారు స్థానిక ఎంఆర్‌సీ వద్ద ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు పోషన్ బి, పఢాయి బి కార్యక్రమంపై మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గర్భిణీల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి ఉంచాలని.. కాన్పు వరకు శ్రద్ధ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

● సోమల: సోమల మండలంలోని అంగన్వాడీ కార్యకర్తలకు మూడు రోజుల శిక్షణ తరగతులను సీడీపీవో రాజేశ్వరి గురువారం ప్రారంభించారు. ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన శిక్షణ తరగతుల్లో ఆమె మాట్లాడుతూ కార్యకర్తలు శిక్షణ తరగతులకు క్రమంగా హాజరు కావాలని, నవచేతన, పిల్లల గ్రోత్ మానిటరింగ్, ఆటవస్తువుల తయారీ పలు అంశాలపై సూచనలు చేశారు.

మందుల పిచికారీపై అవగాహన తప్పనిసరి


మందుల పిచికారీపై అవగాహన కల్పిస్తున్న ఏవో సంధ్య

గంగవరం, మార్చి 20 (ఆంధ్ర జ్యోతి): పంటలకు, పండ్లతోటలకు మందుల పిచికారి చేసే విధానంపై రైతులకు తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని పలమనేరు మండల వ్యవసాయశాఖ అధికారిణి సంధ్య పేర్కొన్నారు. గురువారం పలమనేరు మండలంలోని కూర్మాయి గ్రామంలో రైతులకు ఎస్వీ వ్యవసాయ కళాశాల అధ్యాపకుల ఆధ్వర్యంలో సస్యరక్షణ, మందుల వినియోగం, సంరక్షణ పద్ధతులపై అవగాహన కల్పించారు. మందులను విపరీతంగా వాడటంతో కలిగే అనర్థాలను వివరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ప్రదీప్, స్పందన, రైతులు పాల్గొన్నారు.

కార్యదర్శుల పనిభారం తగ్గించండి


ఎంపీడీవోకు వినతిపత్రం అందిస్తున్న కార్యదర్శులు

వి.కోట, మార్చి 20 (ఆంధ్ర జ్యోతి): గ్రామ కార్య దర్శులుగా పనిచేస్తున్న వారిపై ప్రభుత్వం పని భారం తగ్గించాలని ఎంపీడీవో ఈశ్వరన్‌కు వినతి పత్రం అందజేశారు. గురువారం వి.కోటలో మండల స్థాయి గ్రామ కార్యదర్శుల సమావేశం నిర్వహించి మండల కమిటీని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. మండల కమిటీ అధ్యక్షులుగా వి.కోట ఈవో శివశంకర్, ప్రధాన కార్యదర్శిగా సోమశేఖర్, కోశాధికారిగా దేవేంద్ర, గౌరవ అధ్యక్షులుగా వెంకటరమణ, ఉపాధ్యక్షులుగా ప్రవీణ, శ్రీరాములు, సంయుక్త కార్యదర్శిగా హర్షజ ఇతర కమిటీ సభ్యులను ఎంపిక చేశారు. అనంతరం తీవ్రమైన పని ఒత్తిడితో, అధిక పని భారంతో గ్రామ స్థాయిలో ఎదుర్కొంటున్న సమస్యల నుంచి తమకు ఉపశమనం కల్పించాలని కోరుతూ మండల పరిషత్ అధికారికి కూడిన వినతి పత్రాన్ని అందించారు.

అంబులెన్సును ఢీకొన్న లారీ

● డ్రైవర్ పరిస్థితి విషమం


గాయపడిన గోవిందప్ప

వి.కోట, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): వి.కోట-పలమనేరు ప్రధాన రహదారిలో రాఘవపల్లె సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో శాంతిపురం మండలం కొత్తపేటకు చెందిన డ్రైవర్ గోవిందప్ప (33) తీవ్రంగా గాయ పడ్డాడు. కుప్పం ప్రభుత్వాసుపత్రి వద్ద ప్రైవేటు అంబులెన్సును నడుపుకుంటున్న గోవిందప్ప బుధవారం రాత్రి తిరుపతి నుంచి అంబులెన్సును తీసుకొని వస్తుండగా రాఘవపల్లె వద్ద లారీ ఢీకొంది. ప్రమాదంలో అంబు లెన్సు డ్రైవర్ గోవిందప్ప తీవ్రంగా గాయపడ్డాడు. వి.కోట సీహెచ్‌సీకి తరలించి ప్రథమ చికిత్స అందించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో బెంగళూరు ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్సలు అందిస్తున్నారు. సీఐ సోమశేఖర్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు


ఎస్సీ వసతి గృహాన్ని తనిఖీ చేస్తున్న ఆర్డీవో భవాని

పుంగనూరు రూరల్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని పలమనేరు ఆర్డీవో భవాని హెచ్చరించారు. గురువారం పట్టణంలోని ఎస్సీ హాస్టల్, అంగన్‌వాడీ కేంద్రం, తహసీల్దార్ కార్యాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. ఆర్‌ఐ ఫణికుమార్, హాస్టల్ వార్డెన్ విజయభాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యలపై వెంటనే చర్యలు తీసుకోవాలి


ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి

పుంగనూరు రూరల్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మండల, పట్టణ పరిధిలో తాగునీటి సమస్య రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి అధికారులను కోరారు. గురువారం ఆయన పట్టణంలోని రాంనగర్ కాలనీలోని టీడీపీ నాయకుడు సద్దాంహుస్సేన్ ఇంట్లో జరిగిన కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు, మహిళలు తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, ఇబ్బందులు పడుతున్నట్లు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిని దృష్టిలో ఉంచుకుని తాగునీటి సమస్య రాకుండా అధికారులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాధవరెడ్డి, ఉయ్యాల రమణ, సీవీరెడ్డి, పోలీసు గిరి, కృష్ణానాయక్, శమీపతి, రమణ, గంగాధర్, జనసేన నాయకులు రమణ, చైతన్యరాయల్, బీజేపీ నాయకులు అయూబ్‌ఖాన్ పాల్గొన్నారు.

గిరిజనులకు వైద్య పరీక్షలు

చౌడేపల్లె, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక గిరిజన కాలనీలో గిరిజనులకు గురువారం డాక్టర్ పవన్‌కుమార్ వైద్య పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

బోయకొండలో వేలం వాయిదా

చౌడేపల్లె, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రంలో వివిధ వ్యాపారాలు నిర్వహించుకునేందుకు నిర్వహించిన వేలం వాయిదా పడినట్లు ఆలయ ఈవో ఏకాంబరం పేర్కొన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ భక్తులు సమర్పించు వెంట్రుకలు సేకరించుకునే హక్కు, క్లాక్‌రూం నిర్వహణ, పాదరక్షలు భద్రపరుకునే హక్కు, పేపర్ కవర్లు, బ్యాగులు విక్రయించుకునే హక్కుల కోసం సరైన ధరలు రాకపోవడంతో వేలం వాయిదా వేసినట్లు తెలిపారు.

మాలల సింహగర్జనను జయప్రదం చేయాలి

పుంగనూరు , మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఈనెల 23న తిరుపతిలో జరిగే మాలల సింహగర్జనను జయప్రదం చేయాలని మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి అశోక్‌కుమార్ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద మాలల సింహగర్జన పోస్టర్లను ఆవిష్కరించారు. నాయకులు శ్రీనివాసులు. అంజప్ప, రెడ్డెప్ప, కమ్మిరెడ్డెప్ప, మహానంది, బొట్టు శ్రీనివాసులు, జెవీ, నాగరాజ తదితరులు పాల్గొన్నారు.

బందోబస్తు నడుమ వారపు సంత వేలం

• టీడీపీ, వైసీపీ నేతలు పోటీపడటమే కారణం



పోలీసుల బందోబస్తు నడుమ నిర్వహిస్తున్న వేలం పాట

శ్రీరంగరాజపురం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఎస్ఆర్‌పురం మండలం 49.కొత్తపల్లె పంచాయతీలో వారపు సంత నిర్వహణకు బహిరంగ వేలం గురువారం ఉదయం 11గంటలకు స్థానిక గ్రామ సచివాలయంలో జరిగింది. టీడీపీ, వైసీపీ నాయకులు పోటీపడటంతో గొడవలు జరిగే ఆస్కారం ఉందని పంచాయతీ కార్యదర్శి బాలాజి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో నగరి డీఎస్పీ సయ్యద్ మహమ్మద్ అజీజ్, కార్వేటినగరం సీఐ హనుమంతప్ప, ఎస్ఐలు వెంకటసుబ్బయ్య, చిన్నరెడ్డెప్పలు 25మంది కానిస్టేబుళ్లతో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆ తర్వాత వేలం నిర్వహించగా.. వైసీపీకి చెందిన జయచంద్రారెడ్డి(స్కైలా) అత్యధికంగా రూ.9,15,000తో దక్కించుకున్నారు. సర్పంచ్ డి.వి.డిల్లెయ్య, తదితరులు పాల్గొన్నారు.

రైతు సేవా, వెల్‌నెస్ కేంద్రాలకు భవనాలు సిద్ధం

• నేటినుంచి వినియోగించుకోవచ్చు: ఎంపీడీవో



రైతు సేవా కేంద్రం వద్ద పిచ్చిమొక్కలు తొలగిస్తున్న ఎంపీడీవో కృష్ణమహేశ్‌రెడ్డి తదితరులు

పాలసముద్రం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): వెంగళరాజు కుప్పం పంచాయతీలో రైతు సేవా, వెల్‌నెస్ కేంద్రాల భవనాలు నిరుపయోగంగా వదిలేశారు. ఈ విషయాన్ని స్థానికులు కలెక్టర్ సుమిత్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన ఆదేశాలతో గురువారం ఎంపీడీవో కృష్ణమహేశ్‌రెడ్డి, సర్పంచ్ లిల్లి, ఈవోపీఆర్డీ రమేష్‌లు ఆ భవనాల చుట్టుపక్కల ఉన్న పిచ్చి మొక్కలను తొలగించారు. ఈ రెండు కార్యాలయాలకు పైపులైన్ వేసి.. తాగునీటి సరఫరా చేయించారు. శుక్రవారం నుంచి ఈ రెండు కార్యాలయాలను ఆయా శాఖల సిబ్బంది వినియోగించాలని ఎంపీడీవో ఆదేశించారు.

మేలో ఆంజనేయస్వామి ఆలయ కుంభాభిషేకం

• వరసిద్ధుడి ఆలయ అధికారులు



రాతి వర్గాలకి పూజలు నిర్వహిస్తున్న ఏఈవో రవీంద్రబాబు, అర్చక, పండితులు

ఐరాల(కాణిపాకం), మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకంలోని వరసిద్ధుని ఆలయ ప్రాంగణంలో వెలసిన ఆంజనేయ స్వామి ఆలయ రాతి కట్టడం నిర్మాణ పనులలో భాగంగా గురువారం రాతి వర్గాలకు ఆలయ అర్చక, పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుమారు నెల రోజుల వ్యవధిలో ఆంజనేయ స్వామి ఆలయ పనులు పూర్తి చేయడానికి అధికారులు కృషి చేస్తున్నారు. మే నెలలో ఆంజనేయ స్వామి ఆలయ కుంభాభిషేకం నిర్వహించనున్నట్లు సమాచారం.

ఎస్టీ కాలనీని సందర్శించిన ఆర్డీవో



స్థానికులతో మాట్లాడుతున్న ఆర్డీవో శ్రీనివాసులు

పెనుమూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): కలవగుంట పంచాయతీ విజయనగర్ ఎస్టీ కాలనీని ఆర్డీవో శ్రీనివాసులు గురువారం సందర్శించారు. తమ కాలనీలో ఇంటి పట్టాలు మంజూరు చేయాలని, కొందరికి ఆధార్ కార్డు లేవని డిస్ట్రిక్ట్ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ అధ్యక్షుడు రావడంతో ఆర్డీవో కాలనీకొచ్చారు. సమస్యలను లిఖిత పూర్వకంగా అందించాలని స్థానికులకు సూచించారు. తహసీల్దారు శ్రావణ్‌కుమార్, వీఆర్‌ఓ, సర్వేయర్, స్థానికులు రవి, రాజేంద్ర, రఘురాం, రమణ పాల్గొన్నారు.

ఉలవల విత్తన వినియోగంపై అవగాహన



రైతులతో సమావేశమైన ఏడీలు అహ్మద్, కృష్ణవేణి

బంగారుపాళ్యం/యాదమరి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఉలవల విత్తన వినియోగంపై అన్నమయ్య, చిత్తూరు జిల్లాలకు చెందిన వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు మజీద్ అహ్మద్, కృష్ణవేణి గురువారం రైతులకు అవగాహన కల్పించారు. గురువారం వీకేరువల్లె రైతు సేవా కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ.. ఈ-పంట యాప్‌లో విత్తనాల పంపిణీ వివరాలను నమోదు చేసుకోవాలని చెప్పారు. మండల వ్యవసాయాధికారి చిట్టిబాబు, విస్తరణాధికారి సాదరయ్య, సిబ్బంది ఏకవ మూర్తి, సాయిజ్ఞరైతులు పాల్గొన్నారు. అలాగే యాదమరి మండలంలోని కాశిరాళ్ల రైతుసేవా కేంద్రంలోనూ ఇదే కార్యక్రమం జరిగింది. సంచాలకులతోపాటు చిత్తూరు ఏడీఏ ఉమ, ఏవో చరణ్, రైతులు పాల్గొన్నారు.

ఆశ కార్యకర్తలకు రక్త పరీక్ష కిట్లు పంపిణీ

యాదమరి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): రక్తహీనతను గుర్తించడానికి రక్త పరీక్ష కిట్లను ఆశ కార్యకర్తలకు పీహెచ్‌సీలో సీహెచ్‌ఓ లక్ష్మీనారాయణ గురువారం పంపిణీ చేశారు. మారుమూల ప్రాంతాల్లో మహిళలు రక్తహీనతతో బాధపడుతున్నారని, అటువంటి వారిని గుర్తించి ప్రత్యేక మందులు పంపిణీ చేస్తారన్నారు. హెల్త్ సూపర్‌వైజర్లు సెల్వరాణి, లక్ష్మీపతి, ఎంఎల్‌హెచ్‌పీలు, మహిళా ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

బాలికల హాస్టల్‌కు సీసీ కెమెరాల ఏర్పాటు

పాలసముద్రం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): పాలసముద్రం బాలికల హాస్టల్ ఆవరణలో దాతల సహకారంతో గురువారం పాలసముద్రం ఎస్ఐ చిన్నరెడ్డెప్ప రెండు సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించారు. వార్డెన్ హేమలత పాల్గొన్నారు.

గుట్టకు నిప్పుపెట్టిన ఆకతాయిలు / రెండెకరాల్లో కాలిపోయిన మామిడి చెట్లు



పెనుమూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): వేసవి కాలం వస్తుందంటేనే కొండలు, గుట్టలకు ఆనుకుని పొలాలున్న రైతులు బిక్కుబిక్కుమంటూ గడిపే పరిస్థితి నెలకొంది. ఆకతాయిలు గుట్టలకు నిప్పు పెట్టడమే దీనికి కారణమవుతోంది. తాజాగా మండలంలోని సీఎస్ అగ్రహారం గ్రామానికి చెందిన కమ్మగుట్టకు కొందరు ఆకతాయిలు గురువారం మధ్యాహ్నం నిప్పు పెట్టారు. మంటలు చెలరేగి పక్కనే అదే గ్రామానికి చెందిన కనకమ్మకు చెందిన రెండు ఎకరాల మామిడి చెట్లకు అంటుకున్నాయి. పెంచి దిశలో ఉన్న చెట్లు కాలిపోవడంతో ఆ కుటుంబీకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా గుట్ట పక్కన ఉన్న పొలాలకు ఉపాధి హామీ పథకం ద్వారా బౌండరీ ఏర్పాటు చేసే కాస్త ఉపయోగం ఉంటుందని రైతులు అంటున్నారు. అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

అడవికి నిప్పు పెట్టొద్దు



రెడ్డిగుంటలో అవగాహన కల్పిస్తున్న అటవీ సిబ్బంది

చిత్తూరు సెంట్రల్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): అడవికి నిప్పు పెట్టొద్దని అటవీ అధికారులు కోరారు. గురువారం రెడ్డిగుంటలో 'అడవికి నిప్పు.. మానవాళికి ముప్పు' అనే అంశంపై స్థానికులకు అవగాహన కల్పించారు. అటవీ శాఖ తూర్పు డివిజన్ ఎఫ్ఆర్వో థామస్ ఆధ్వర్యంలో మ్యాజిక్ షో, కళాజాత కార్యక్రమాలు చేపట్టారు. అడవి వల్ల కలిగే ప్రయోజనాలను నవ్య ఫోక్ ఆర్ట్స్ ఆర్గనైజేషన్ కళాకారులు వివరించారు. ఎఫ్‌బీవోలు మధు, ప్రభాకర్‌రెడ్డి, గౌస్ బాషా, ఏబీవో షణ్ముగం, ఎఫ్ఎస్‌వో ఉషా, సిబ్బంది పాల్గొన్నారు.

గుడిపాల: మండలంలోని పలు గ్రామాల్లోనూ అడవికి నిప్పు.. మానవాళికి ముప్పు అంశంపై జానపద గేయాలతో కళాకారులు అవగాహన కల్పించారు. బీట్ అధికారి ప్రభాకర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

గుడిపాలలో ఆగని ఆర్టీసీ బస్సులు

• ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు

గుడిపాల, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): గుడిపాలలో అన్ని ఆర్టీసీ బస్సులు నిలపాలని సంబంధిత అధికారులు ఆదేశాలు జారీచేసినా, కొందరు డ్రైవర్లు పట్టించుకోవడం లేదని ప్రయాణికులు వాపోతున్నారు. ప్రధానంగా.. రాయచోటి, తిరుమల, శ్రీకాళహస్తి బస్సులు ఆగకుండా వెళ్తున్నాయని, దీంతో రాత్రిపూట తీవ్ర ఇబ్బంది పడుతున్నామని పేర్కొన్నారు. ఉదయం వేళల్లో పాఠశాలలు, కాలేజీలకు వెళ్లే విద్యార్థులు, టీచర్లు పడుతున్న బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయని చెప్పారు. ఇకనైనా సంబంధిత అధికారులు దీనిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మునీశ్వరుడికి చందన అలంకరణ



నగరి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): నగరి పట్టణ పరిధిలోని కొలిమిట్ట వేలేనగర్‌లోని మునీశ్వరస్వామి ఆలయంలో మూలవిరాట్‌కు గురువారం చందన అలంకారం చేశారు. భక్తులు అధిక సంఖ్యలో రావడంతో ఏర్పాట్లను ఆలయ నిర్వాహకుడు శ్రీనివాసులు పర్యవేక్షించారు.

పీ4 సర్వేలో అందరూ పాల్గొనండి



సమావేశంలో ప్రసంగిస్తున్న ప్రిన్సిపాల్ సీతా విజయలక్ష్మి

వెదురుకుప్పం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): పీ4 సర్వేలో ప్రతి ఒక్కరూ పాల్గొన్నాలని కార్వేటినగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీతా విజయలక్ష్మి సూచించారు. కళాశాలలో విద్యార్థులకు సర్వే ప్రాముఖ్యంపై గురువారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్‌ఎస్‌ఎస్ పీవో డాక్టర్ ధనంజయరెడ్డి, ఏఎన్‌వో నాగార్జున, వీఆర్వో బాలచంద్రసింగ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

షమీర్‌శర్మకు నివాళి



గంగాధర నెల్లూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): జైన్ ఫామ్ ప్రెష్ ఫ్యాక్టరీ జైన్ ప్రెసిడెంట్ షమీర్‌శర్మ ఇటీవల గుండెపోటుతో మరణించడంతో సిబ్బంది, రైతాంగానికి తీరనిలోటని మేనేజింగ్ డైరెక్టర్ ఆదాంగ్ జైన్, బిజినెస్ హెడ్ రోహన్ షా, చిత్తూరు జైన్ సంఘం అధ్యక్షుడు సుజాష్‌జైన్ తెలిపారు. చిత్తూరు నగరంలోని సూర్యప్రతాప్ కల్యాణ మండపంలో షమీర్‌శర్మ సంస్మరణ సభ గురువారం నిర్వహించారు. పలువురు ఆయన చిత్రపటం వద్ద నివాళి అర్పించారు. షమీర్ శర్మ సతీమణి పూజ, కుమారులు హర్షరాజ్, షమీర్‌శర్మ, సోదరుడు తనూజ్, జైన్ కంపెనీ హెచ్‌ఆర్ మేనేజర్ మంగేష్, వైఎస్సార్‌టీయూసీ జైన్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యంరెడ్డి, జైన్ ప్రొడక్షన్ మేనేజర్లు అశోక్, భవానీ, జైన్ ఫ్యాక్టరీ కో-ఆర్డినేటర్ కోదండపాణి పాల్గొన్నారు.

ఇంటి పన్నులు చెల్లించండి



ఇంటి పన్ను రశీదు ఇస్తున్న ఈవోపీఆర్డీ, ఉద్యోగులు

వెదురుకుప్పం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఇంటి పన్నులు, లైసెన్స్ ఫీజులు చెల్లించి అభివృద్ధికి సహకరించాలని ఈవోపీఆర్డీ ఎల్.షరుఫొద్దీన్ కోరారు. గురువారం వెదురుకుప్పం గ్రామ పంచాయతీలో సచివాలయ ఉద్యోగులతో కలిసి ఇంటి పన్నులు, లైసెన్స్ ఫీజులు వసూలు చేపట్టారు. పంచాయతీ కార్యదర్శి మనోహర్, డిజిటల్ అసిస్టెంట్ సతీష్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ పద్మావతి, సర్వేయర్ విజయలక్ష్మి, ఏఈవో దయాకర్ పాల్గొన్నారు.

వైభవంగా కుంభాభిషేకం



కుంభాభిషేక కార్యక్రమానికి హాజరైన భక్తులు

చిత్తూరు కల్చరల్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): కట్టమంచి షిరిడీ విశ్వసాయిబాబా ఆలయ మహా కుంభాభిషేక కార్యక్రమాలు వైభవంగా జరుగుతున్నాయి. గురువారం వేద పారాయణం నిర్వహించి, మండప దేవతలకు, రాజగోపురానికి పూజలు చేశారు. ఆలయ ట్రస్ట్ సీకే బాబు దంపతులు, చిత్తూరు ఎమ్మెల్యే జగన్‌మోహన్ తల్లిదండ్రులు, భక్తులు పాల్గొన్నారు.

టెన్త్ పరీక్ష కేంద్రంలోకి బిట్లు పంపడంపై రెండువర్గాల తగాదా?

• ఆలస్యంగా వెలుగులోకి..



గంగాధరనెల్లూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్ష కేంద్రంలోకి బిట్లు పంపడంపై రెండు వర్గాల మధ్య తగాదా జరిగినట్లు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గంగాధరనెల్లూరు హైస్కూల్లో టెన్త్ పరీక్ష కేంద్రం ఏర్పాటు చేశారు. ఈనెల 17, 19 తేదీల్లో పరీక్షలు జరిగాయి. ఈ సందర్భంగా ఓ వర్గానికి చెందినవారు తమ వారికోసం బిట్లను పరీక్ష కేంద్రంలోనికి పంపడానికి అక్కడ విధుల్లో ఉన్న ఓ పోలీసును వినియోగించుకున్నారట. అదేసమయంలో మరో వర్గానికి చెందినవారు కూడా తమ వారికోసం బిట్లు పంపాలనుకున్న ప్రయత్నాన్ని పోలీసు సాయంతో అడ్డుకున్నారట. దీంతో ఈ రెండువర్గాల మధ్య తగాదా జరిగినట్లు తెలిసింది. ఇప్పుడీ అంశంపై నలుగురు వ్యక్తులు ఎక్కడ కలిసినా చర్చించుకుంటున్నారు.

మహిళ మెడలోని చైన్ లాక్కెళ్లారు

నగరి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మహిళ మెడలోని తాళిబొట్టు చైన్ లాక్కెళ్లారు. ఈ ఘటన ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలోని 7కే క్రికెట్ టర్ఫ్ వద్ద గురువారం జరిగింది. గుండ్రాజుకుప్పం ఏపీఐఐసీ కాలనీకి చెందిన భార్గవి బ్యాంకు పని నిమిత్తం నగరి పట్టణానికి మరో మహిళతో వెళ్లారు. వస్తుండగా ఆటోలో 7కే క్రికెట్ టర్ఫ్ వద్దకు చేరుకుంది. తర్వాత గ్రామానికి నడిచి వెళుతుండగా అప్పటికే హెల్మెట్ ధరించిన ఇద్దరు వ్యక్తులు ఆమెను అనుసరించారు. నిర్మానుష్య ప్రదేశం రాగానే ఎదురుగా వచ్చి భార్గవి మెడలోని తాళిబొట్టు చైన్‌ను లాగారు. ఆమె ప్రతిఘటించడంతో ఇనుపరాడ్ చూపించి చైన్ లాక్కెళ్లిపోయారు. చైన్ బరువు మూడు సవర్లు ఉంటుందని బాధితురాలు తెలిపారు. బైక్‌పై దొంగలు వెళ్లే దృశ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డు అయ్యాయని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ విక్రమ్ తెలిపారు.

నలుగురు పేకాటరాయుళ్ల అరెస్టు

గుడిపాల, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): శ్రీరంగంపల్లె పరిసరాల్లో ఎస్పీ మణికంఠ ఆదేశాలతో గురువారం పేకాట స్థావరాలపై దాడులు నిర్వహించారు. సుమారు 11 మంది పేకాటరాయుళ్లను పట్టుకోవడానికి ప్రయత్నించారు. ఏడుగురు పరారవగా, నలుగురిని పట్టుకున్నట్లు ఎస్ఐ రామ్మోహన్ తెలిపారు. వారి వద్ద నుంచి రూ.12,100 స్వాధీనం చేసుకున్నారు. అరెస్టయినవారిలో.. వెప్పాలమానుచేనుకు చెందిన శరవణ, కొత్తపల్లికి చెందిన వృత్తి రాజేంద్ర, సురేష్‌బాబు ఉన్నారన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం



జయప్రకాష్ (ఫైల్ ఫొటో)

యాదమరి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు రాష్ట్రం వరదరాజులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం చెందాడు. వెప్పలపల్లె గ్రామ పంచాయతీకి చెందిన ప్రకాష్ కుమారుడు జయప్రకాష్ (22) స్థానికంగా టీ దుకాణం నిర్వహిస్తున్నాడు. గురువారం సొంత పనులపై వరదరాజులో జరుగుతున్న సంతకు ద్విచక్రవాహనంపై బయల్దేరాడు. వరదరాజు యల్లమ్మ ఆలయం సమీపంలో ఓవర్‌టేక్ చేస్తుండగా లారీ ఢీకొనడంతో తలకు తీవ్రగాయాలై సంఘటన స్థలంలోనే మృతి చెందాడు.

అప్పుల బాధతో మహిళ ఆత్మహత్య

చిత్తూరు అర్బన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధతో ఓ మహిళ గురువారం ఆత్మహత్య చేసుకున్నారు. ఒకటో పట్టణ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పెద్దముడ్డం మండలానికి చెందిన షేక్ హసీన్(35) చిత్తూరు కూరగాయల మార్కెట్‌లో కూలీగా పనిచేస్తున్నారు. సొంతూరిలో అప్పులు చేసి.. ఇక్కడకు వచ్చేశారు. అప్పులు ఇచ్చినవారి ఒత్తిడి తట్టుకోలేక సుందరయ్యవీధిలో విషం తాగి ఆత్మహత్య చేసుకుంది.

మద్యానికి బానిసైన వ్యక్తి కూడా..

మద్యానికి బానిసైన ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఒకటో పట్టణ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. యాదమరి మండలం కొరకాళ్లకు చెందిన వెంకటేశ్(40) నగరంలోని ఎస్టేట్‌లో వెల్డర్‌గా పనిచేస్తున్నాడు. కొన్ని నెలల కిందట భార్య వదిలేసి పుట్టింటికి వెళ్లిపోయింది. ఆ బాధతో మద్యానికి బానిసయ్యాడు. గురువారం పూటుగా మద్యం తాగి.. పనిచేసే చోట ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించాక బంధువులకు అప్పగించి, కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

అరగొండ పంచాయతీకి రూ.20.35 లక్షల ఆదాయం

తవణంపల్లె, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): అరగొండ గ్రామ పంచాయతీ కార్యాలయంలో కార్యదర్శి మునిగేసన్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన వేలం పాటల ద్వారా రూ.20,35,000 ఆదాయం వచ్చింది. వారపు సంత రుసుం వసూలు లీజు హక్కు ద్వారా రూ.7.95 లక్షలు, దినసరి మార్కెట్ రుసుం వసూలు లీజు హక్కు ద్వారా రూ.4.25 లక్షలు, అరగొండ కొత్త బస్టాండులోని పంచాయతీ షాపింగ్ కాంప్లెక్స్ ఆరు గదులకు ఏడాది కాలానికి సంబంధించిన లీజు హక్కు ద్వారా రూ.8.15 లక్షలు వచ్చినట్లు వివరించారు. ఈవోపీఆర్డీ రాజేంద్రరాజు, సర్పంచ్ మల్లుదొర పాల్గొన్నారు.

ప్రీ ప్రైమరీపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ



గంగాధరనెల్లూరులో ప్రసంగిస్తున్న సీడీపీవో విశాలాక్షి

గంగాధరనెల్లూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): అంగన్వాడీ కేంద్రాల్లో ప్రీ ప్రైమరీ 1,2 తరగతులు నిర్వహణపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నట్లు సీడీపీవో విశాలాక్షి తెలిపారు. పోషణ్ భీ.. పడాయి భీ, అంగన్వాడీ కేంద్రాల్లో పీపీ వన్, పీపీ టూ కార్యక్రమాలు అమలుపై టీచర్లకు మూడ్రోజుల శిక్షణను గురువారం ఎంపీడీవో కార్యాలయంలో ఆమె ప్రారంభించారు. సూపర్‌వైజర్లు అనురాధ, నాగరత్నమ్మ, టీచర్లు పాల్గొన్నారు.

చిత్తూరు అర్బన్: బీఎస్ కన్నన్ ప్రభుత్వ పాఠశాలలో ఐసీడీఎస్ పీడీ వెంకటేశ్వరి ప్రారంభించారు. సీడీపీవో శ్యామసుందరి, సూపర్‌వైజర్లు వసంతకుమారి, కవిత, రాజేశ్వరి, వర్కర్లు పాల్గొన్నారు.

పెనుమూరు: ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో సీడీపీవో వనితశ్రీ, సూపర్‌వైజర్ భాగ్య, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

బంగారుపాళ్యం: మొగిలివెంకటగిరి ఉన్నత పాఠశాలలో సీడీపీవో వాణిశ్రీదేవి, సూపర్‌వైజర్లు జయశ్రీ, రెడ్డి కళ్యాణి, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

యాదమరి: కొరగ్గరపల్లె పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో సీడీపీవో వాణిశ్రీదేవి, హెచ్‌ఎం లలిత, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

గుడిపాల: మండలంలో జరిగిన కార్యక్రమంలో సీడీపీవో శ్యామసుందరి, అంగన్వాడీ సూపర్‌వైజర్లు తేయకాశ్, పుష్పలత, స్వర్ణలత, అంగన్వాడీ టీచర్లు బుజ్జి, అనిత, నాగమణి, శాంతి పాల్గొన్నారు.

వెదురుకుప్పం: మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో సీడీపీవో శకుంతల, బాల, భారతి, ఎంఈవో మహేశ్వర్ పాల్గొన్నారు.

'పిచ్చుక జాతిని సంరక్షించుకుందాం'

కల్లూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): అంతరించిపోతున్న పిచ్చుక జాతిని సంరక్షించుకుందామని కల్లూరు జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం శ్రీవాణి, ఎన్జీసీ డివిజనల్ కన్వీనర్ రాజేంద్ర, గ్రీన్ మాస్టర్ వెంకటశెట్టి తెలిపారు. పులిచెర్ల మండలం కల్లూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం అంతర్జాతీయ పిచ్చుకల దినోత్సవాన్ని నిర్వహించారు.

సంక్షిప్తంగా..

వరసిద్ధుడి ఆలయంలో 30న ఉగాది వేడుకలు

ఐరాల(కాణిపాకం), మార్చి 20 (ఆంధ్రజ్యోతి): వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో ఈనెల 30వ తేదీన ఉగాది వేడుకలను నిర్వహించనున్నట్లు ఈవో పెంచలకిషోర్ తెలిపారు. కల్యాణ వేదిక వద్ద అర్చకులు, పండితులు, పురోహితులు ఆధ్వర్యంలో ఉదయం 9 నుంచి 11 గంటల మధ్య పంచాంగ శ్రవణం ఉంటుందన్నారు. మూలవిరాట్‌కు వందనాలంకారం చేస్తారని పేర్కొన్నారు.

23న ఆయుర్వేద వైద్య శిబిరం

చిత్తూరు కల్చరల్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): సిద్ధి సమాధి యోగ శిక్షణ శాఖ ఆధ్వర్యంలో ఈనెల 23వ తేదీన కణ్ణన్ హైస్కూల్లో ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించనున్నారు. ఈ మేరకు నిర్వాహకులు నరేంద్ర కుమార్‌జీ, బ్రహ్మయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి ఎస్వీ ఆయుర్వేద వైద్య కళాశాల, మోహన్ దయాల్ టెక్ హాస్పిటల్ సంయుక్తంగా ఉచితంగా పరీక్షలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. నగరవాసులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పారిశుధ్య కార్మికుడి మృతికి నివాళి

చిత్తూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ పారిశుధ్య విభాగంలో ఆప్కాస్ సోర్సింగ్ కార్మికుడిగా పనిచేస్తున్న మోహన్ మృతికి కమిషనర్ నరసింహప్రసాద్, ఎంహెచ్‌వో డాక్టర్ లోకేష్‌లు నివాళి అర్పించారు. మిట్టూరు మస్టర్‌లో విధులు నిర్వహించే ఇతను అనారోగ్యంతో గురువారం ఉదయం మృతి చెందారు. కమిషనర్, ఇతర అధికారులు మృతుని నివాసానికి వెళ్లి, కుటుంబీకులను పరామర్శించారు. మట్టి ఖర్చుల కోసం ప్రభుత్వ సాయం రూ.15వేలను కుటుంబీకులకు అందించారు.

బకాయిలు చెల్లించకుంటే చర్యలు: కమిషనర్

నగరి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఇంటి, ఖాళీస్థలం పన్నులతోపాటు మంచినీటి కొళాయి చార్జీలు వెంటనే చెల్లించాలని నగరి మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి తెలిపారు. ఇప్పటికే బకాయిలున్నవారు ఈనెల 31వ తేదీలోపు చెల్లించాలన్నారు. లేదంటే తప్పనిసరి చర్యలు తప్పవని హెచ్చరించారు. బిల్లుల మున్సిపల్ కార్యాలయంలోని ప్రత్యేక కౌంటర్‌లో కానీ పట్టణంలోని 17వ వార్డు సచివాలయంలో అయినా చెల్లించాలని పేర్కొన్నారు.

సంతపేట మసీదు నూతన కార్యవర్గం

చిత్తూరు అర్బన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): సంతపేట మసీదు నూతన కార్యవర్గాన్ని ప్రభుత్వం గురువారం ప్రకటించింది. ఈ మేరకు ఏపీ స్టేట్ వక్ఫ్ బోర్డు సీఈవో షేక్ మహ్మద్‌అలీ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రెసిడెంట్‌గా ఫైరోజ్, వైస్ చైర్మన్‌గా షేక్ ముజీబ్, సెక్రటరీగా షేక్ అబ్దుల్ రహమాన్, జాయింట్ సెక్రటరీగా ఫరీద్, కోశాధికారిగా జునీద్ అహ్మద్‌ఖాన్, మెంబర్లుగా షంషుద్దీన్ ఖాన్, బాబు, ముసా, చాంద్‌బాషా, ముజీబ్, షాధిక్‌లను నియమించారు. నూతన కమిటీ ఏర్పాటుకు సహకరించిన ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌కు సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

కేజీబీవీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కుప్పం/రామకుప్పం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): కుప్పం మండలం పరమసముద్రం గ్రామంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో 6, 11 తరగతుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎం.విజయలక్ష్మి తెలిపారు. దరఖాస్తులను ఆన్‌లైన్‌లో ఈనెల 22 నుంచి ఏప్రిల్ 11 వరకు స్వీకరిస్తామన్నారు. అర్హులైన బాలికలు, అనాథలు, బడిబయటి పిల్లలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, బీపీఎల్‌కు చెందినవారు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 2300275247, 9885376550 నంబర్లలో సంప్రదించాలని కోరారు. • రామకుప్పం మండలంలోని విజలాపురం కస్తూర్బా బాలికల గురుకుల విద్యాలయంలో ప్రవేశం కోసం విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ అమరావతి కోరారు. ఆరో తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఎంపీసీ గ్రూపులో ప్రవేశం కోసం అనాథ, బడిమానేసిన పిల్లలు, డ్రాపౌట్, పేద, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ పిల్లలు 22 నుంచి ఏప్రిల్ 11 వరకు వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

23న మాలల సింహగర్జన

పుంగనూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో ఈనెల 23వ తేదీన మాలల సింహగర్జన జరుగుతుందని మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి అశోక్‌కుమార్ తెలిపారు. గురువారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద మాలల సింహగర్జన పోస్టర్లను ఆవిష్కరించారు. శ్రీనివాసులు, అంజప్ప, రెడ్డెప్ప, కమ్మరెడ్డెప్ప, మహానంది, బొట్ల శ్రీనివాసులు, జేపీ, నాగరాజ తదితరులు పాల్గొన్నారు.